RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: HYDERABAD | సంపుటి: 10 | సంచిక: 150 | గురువారం, 19 డిసెంబర్, 2024 | ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ | అసోసియేట్ ఎడిటర్: కే రాజేంద్ర ప్రసాద్ | పేజీలు: 08 వెల: 2 రూ/-

## సంక్రాంతి నుంచి మరో రెండు హామీలు

- చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ ఆనందమయ క్షణాల్లో ఉంటారు
- అటువంటి సంక్రాంతి సంబరాలకు తెలంగాణ సర్కార్ సరికొత్త పథకాలతో సందడి చేయనుంది
- పేదల కుటుంబాల్లో కూడా ఆ సంబరాన్ని తెచ్చేందుకు పెద్ద ప్లాన్
- భూమి లేని పేదలకు ఆర్థిక చేయూత
- సంక్రాంతి పండుగ తర్వాత సుమారు 30 లక్షలకు పైగానే రేషన్ కార్డులను ప్రభుత్వం అందించనుంది



హైదరాబాద్

సంక్రాంతి వస్తోంది. సంబరాలు తెస్తోంది. ఎటు చూసినా గ్రామాలు సందడి సందడిగా కనిపిస్తాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ ఆనందమయ క్షణాల్లో ఉంటారు. అటువంటి సంక్రాంతి సంబరాలకు తెలంగాణ సర్కార్ సరికొత్త పథకాలతో సందడి చేయనుంది. సంక్రాంతి అంటేనే సందడి.. సంబరం.. అందుకే సీఎం రేవంత్ రెడ్డి, పేదల కుటుంబాల్లో కూడా ఆ సంబరాన్ని తెచ్చేందుకు పెద్ద ప్లాన్ వేశారు. తెలంగాణ సర్కార్ ఏడాది పాలనలో ఏం చేసిందంటే.. చాలానే చేసిందంటున్నారు ప్రజలు. అందుకు ఉదాహరణే మొన్న జరిగిన ప్రజా విజయోత్సవాలు. ఏడాది కాలంలో మహిళలకు ఫ్రీ బస్, సుమారు 55 వేల ఉద్యోగాలు, రుణమాఫీ, గృహ జ్యోతి, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, గురుకులం విద్యార్థులకు మెనూ మార్పు, మూసీ - మిగతా3లో



## దమ్ముంటే ఫార్ములా ఈ-రేస్‌పై సభలో చర్చ పెట్టండి

- రేవంత్ రెడ్డికి కేటీఆర్ లేఖ
- ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంపై అసెంబ్లీలో చర్చ జరపాలన్న సీఎం
- తెలంగాణకు మంచి జరగాలనే ఈ-రేసింగ్ నిర్వహించినట్లు వెల్లడి
- రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం

## ఆ పథకం తెచ్చి భూదందా చేశారు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ భూములు పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల పరం అయ్యాయి
- సుమారు రూ.1.50 లక్షల కోట్ల విలువైన భూములు చేతులు మారాయి
- ఓ వ్యక్తి గత రెండు, మూడేళ్లపాటు ప్రతి రోజూ ఇదే చేశారు
- పార్ట్-బి భూములన్ని సక్రమం చేసుకున్నారు



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ధరణి పేరుతో పెద్దఎత్తున భూ బదలాయింపు దందా జరిగిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ భూములు పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల పరం అయ్యాయని భట్టి ధ్వజమెత్తారు. సుమారు రూ. 1.50 లక్షల కోట్ల విలువైన భూములు చేతులు మారాయని ఉపముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఈ భూ దందాతో పోల్చితే కాళేశ్వరం వ్యవహారం చిన్న విషయమని ఆయన చెప్పారు. ఓ వ్యక్తి గత రెండు, మూడేళ్లపాటు ప్రతి రోజూ ఇదే చేశారని, పార్ట్-బి భూములన్ని సక్రమం చేసుకున్నారని భట్టి ఆరోపించారు. దీని మొత్తాన్ని ఫోరెన్సిక్ ఆడిట్ - మిగతా3లో



## నా వ్యాఖ్యలను కాంగ్రెస్ వక్రీకరించింది

- కేంద్ర హోం మంత్రి అమిత్‌షా
- కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ వ్యతిరేకి
- వీరసావర్కర్‌ను అవమానించినదీ, ఎమర్జెన్సీ విధించినదీ కాంగ్రెస్ పార్టీయే
- రాజ్యాంగ విలువలన్నింటినీ వాళ్లు కాలరాసారు
- తొలుత జనసంఘ్, ఆ తర్వాత భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ అంబేద్కర్ సిద్ధాంతాలను అనుసరిస్తూనే ఉన్నాయి

# ఆ ఇద్దరు కలిసి దేశ పరువు తీశారు

- దేశంలో వ్యాపారం చేయాలంటే లంచం ఇచ్చే పరిస్థితిని తెచ్చారు
- అదానీ అవినీతిపై మోదీ ఎందుకు మాట్లాడటం లేదు
- అదానీపై విచారణ జరిపించాలని డిమాండ్
- భారత వ్యాపార సంస్థలు అవినీతిలో కూరుకుపోయాయని విమర్శ
- అదానీ విషయంలో కేసీఆర్ స్టాండ్ ఏంటో చెప్పాలి
- బీజేపీ పెద్దల కాళ్ళు మొక్కి అరెస్టును తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.




హైదరాబాద్

ప్రధాని మోదీ, బీజేపీపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. 75 ఏళ్లుగా దేశ ప్రతిష్ఠను కాంగ్రెస్ పార్టీ పెంపొందించిందని... మోదీ, అదానీ కలిసి దేశ పరువు తీసేశారని విమర్శించారు. అదానీ అవినీతిని మోదీ ఎందుకు ప్రశ్నించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. అదానీపై వచ్చిన ఆరోపణలు, మణిపూర్ అల్లర్ల అంశంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ నేతలు ఛలో రాజ్ భవన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా రాజ్ భవన్ సమీపంలో సీఎం భైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ, అదానీ అనుబంధం మన దేశ ప్రతిష్టను దెబ్బ తీస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. అదానీ, మణిపూర్ అంశాలపై ప్రధాని మౌనంపై దేశవ్యాప్త నిరసనలకు ఏఐసీసీ పిలుపునిచ్చిన నేపథ్యంలో హైదరాబాద్‌లో తెలంగాణ కాంగ్రెస్ నేతలు ర్యాలీ చేపట్టారు. నెక్లెస్ రోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహం నుంచి రాజ్‌భవన్‌కు ర్యాలీగా కాంగ్రెస్ నేతలు వెళ్లారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. దేశంలో వ్యాపారం చేయాలంటే లంచం ఇచ్చే పరిస్థితిని తెచ్చారని మండిపడ్డారు. అదానీ, ప్రధాని - మిగతా3లో



## ఎస్సీ, ఎస్టీలను కాంగ్రెస్ అవమానిస్తోంది

- కాంగ్రెస్‌కు గట్టి కౌంటరిచ్చిన ప్రధాని మోదీ
- అంబేద్కర్ వారసత్వాన్ని తుడిచిపెట్టడానికి కాంగ్రెస్ ప్రయత్నం
- షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలను కించపరిచేందుకు కాంగ్రెస్ ఎలాంటి విధివిధానాలను ఆచరిస్తోందో ప్రజలు చూస్తూనే ఉన్నారు
- 'కాంగ్రెస్ పార్టీ, దాని కుళ్లిన పర్యావరణ వ్యవస్థ రాజ్యాంగ నిర్మాతైన బీఆర్ అంబేద్కర్‌ను అవమానించడాన్ని ద్వేషపూరిత అబద్ధాలు దాచగలవని భావిస్తే.. వారంతా పొరపాటుపడినట్టే

## ధరణి స్థానంలో భూభారతి

- 'ధరణి పోర్టల్‌లో ఆస్తుల వివరాలు తెలుసుకునే పరిస్థితి లేదు
- కానీ భూ భారతిలో వివరాలు అన్నీ ఉంచుతాం'
- శాసనసభలో భూభారతి బిల్లు
- ప్రవేశ పెట్టిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి
- ధరణి పోర్టల్‌తో కొత్త సమస్యలు తలెత్తాయ్



హైదరాబాద్

శాసనసభలో భూభారతి బిల్లును రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా భూభారతి బిల్లుకు సంబంధించిన ముఖ్యాంశాలను పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభకు వివరించారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి స్థానంలో భూభారతిని తీసుకొస్తున్నాం. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు లిఖితపూర్వకంగా సూచించిన అంశాలను పొందుపరిచాం. ముసాయిదా బిల్లును 40 రోజులు వెబ్‌సైట్‌లో ఉంచాం. ఎమ్మెల్యేలు, మేధావులు ఇచ్చిన అంశాలను డ్రాఫ్ట్‌లో పెట్టాం. - మిగతా3లో



## జేపీసీలో ప్రియాంకాగాంధీ!

- 'వన్ నేషన్, వన్ ఎలక్షన్'బిల్లుపై ఏర్పాటు కాబోతున్న జాయింట్ పార్లమెంటరీ కమిటీ
- ప్రియాంకాగాంధీతోపాటు మనీష్ తివారి, సుఖ్‌దేవ్ భగత్, రణదీప్ సుర్జేవాలాకు కూడా జేపీసీలో చోటు
- ఒకే దఫా ఎన్నికలు నిర్వహించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఒక బిల్లును పార్లమెంట్ ముందుకు తీసుకొచ్చింది

తెలంగాణ సేన

# సంపాదకీయం

## మళ్లీ విద్వేషాలు విజృంభిస్తున్న వేళ..

కొందరి పేర్లు చరిత్ర పుటల్లో నిలిచిపోతాయి. ఎంత కాలం గడిచిపోయినా చరిత్రలో వారి పేర్లను, వారు చేసిన పనులను చెరిపివేయడం అంత సులభం కాదు. పాములపర్తి వెంకట నరసింహారావు ఇదే డిసెంబర్ మాసంలో దివంగతులై రెండు దశాబ్దాలు గడచిపోయాయి. ఇప్పుడు మరోసారి ఆయన పేరు స్మరించుకునే అవసరం నేటి రాజకీయ నాయకులకు కలిగింది. సుప్రీంకోర్టుకు, జాతీయ సమగ్రతా మండలికి బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చేసిన వాగ్దానాలను కూడా విస్మరించి, ఆ పార్టీ అగ్రనేతల సమక్షంలో బాబ్రీ మసీదు కట్టడం కూల్చివేత జరిగింది. ఈ ఘటనకు పీవీనే చాలా మంది తప్పుపట్టారు. అయితే అంతకు సరిగ్గా ఏడాది ముందే 1991లో ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదింపచేసి దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో మతపరమైన భావోద్వేగాలు తలెత్తకుండా చూసింది కూడా పీవీయే అన్న విషయం చాలా మంది మరిచిపోయారు! సంభల్‌లో మతపరమైన హింసాకాండ, మధురలో వివాదం నేపథ్యంలో ఇప్పుడు బీజేపీ, కాంగ్రెస్ నేతలకు కూడా ఆ చట్టం గుర్తుకువచ్చింది. ఇదే ఏడాది ప్రథమంలో పీవీకి భారతరత్న పురస్కారాన్ని ప్రకటించిన బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు ఈ చట్టాన్ని రద్దు చేయాలని తమ పార్టీ నేతలే అంటుంటే వారించలేకపోతోంది. నరసింహారావును అనేక సార్లు అగౌరవపరిచిన కాంగ్రెస్ నేతలకు కూడా ఇప్పుడు పీవీ ప్రభుత్వమే ప్రార్థనా స్థలాల చట్టాన్ని ఆమోదింపచేసిన విషయం గుర్తుకు వచ్చింది. నిజానికి ఈ చట్టంపై మళ్లీ చర్చ రేపి తీగ లాగింది కొద్ది రోజుల క్రితం పదవీవిరమణ చేసిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్. ఒక మత ప్రదేశపు స్వభావాన్ని మార్చడం 1991 చట్టం క్రింద నిషేధించినప్పటికీ, ఆ ప్రదేశపు మత స్వభావాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయడాన్ని ఆ చట్టం అడ్డుకోలేదని చంద్రచూడ్ వ్యాఖ్యానించి ప్రస్తుత వివాదాలన్నిటికీ తెర లేపారు. దేశంలో అనేక ప్రాంతాల్లోని ప్రార్థనా స్థలాలలో సర్వేల కోసం పిటిషన్లు దాఖలయ్యాయి. వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో పురావస్తు శాఖ సర్వేకు ఆదేశించిన స్థానిక కోర్టు ఈ చట్టం ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నం చేసింది. ఆ తర్వాత 1991 చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. తాజాగా యూపీలోని సంభల్ మసీదులో అలాంటి సర్వేను జిల్లా కోర్టు అనుమతించినందుకే గత నెలలో మతపరమైన హింసాకాండ జరిగింది. ఈ నేపథ్యంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం ప్రార్థనా మందిరాల విషయంలో దేశంలో అన్ని కోర్టులు యథాతథ స్థితి నెలకొనేలా చూడాలని గత వారం ఆదేశించడం ప్రాధాన్యం సంతరించుకుంది. 1991 చట్టం చెల్లుతుందా లేదా అన్న విషయం తాము తేల్చేంతవరకూ ప్రార్థనా స్థలాల్లో సర్వేలు జరిపించాలని దాఖలైన పిటిషన్లను ఏ కోర్టూ నమోదు చేసుకోవద్దని, ఎలాంటి ఆదేశాలు జారీ చేయకూడదని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. అసలు ఈ చట్టం రాజ్యాంగబద్ధతపై కేంద్ర ప్రభుత్వం నాలుగు వారాల్లో తన అభిప్రాయం ఏమిటో చెప్పాలని స్పష్టంగా నిర్దేశిస్తూ 2025 ఫిబ్రవరి 17 వరకు తదుపరి విచారణను వాయిదా వేసింది. దీనితో కనీసం మూడునెలల వరకైనా ప్రార్థనా స్థలాల విషయంలో మత పరమైన భావోద్వేగాలకు అడ్డుకట్ట వేసినట్లైంది. అయోధ్యలో రామజన్మభూమిపై బీజేపీ నిర్వహిస్తున్న ఉద్యమం తారస్థాయికి చేరుకుంటున్న సమయంలో అధికారంలోకి వచ్చిన పీవీ నరసింహారావు, వచ్చీ రాగానే దేశవ్యాప్తంగా ఇతర ప్రార్థనాస్థలాల్లో ఇలాంటి భావోద్వేగాలు తలెత్తకుండా ఉండేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రార్థనాస్థలాల్లో యథాతథ పరిస్థితిని పరిరక్షించేందుకు చట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు 1991 జూలైలో రాష్ట్రపతి వెంకట్రామన్ పార్లమెంటు ఉభయ సభల నుద్దేశించి చేసిన ప్రసంగంలోనే స్పష్టం చేశారు. ఆ తరువాత సెప్టెంబర్‌లో రెండు రోజుల పాటు లోక్‌సభలో అద్భుతమైన చర్చ జరిగింది. ఇటీవలి కాలంలో కొన్ని వర్గాలు దేశంలో అసహనం వ్యాప్తి చేయాలని చూస్తున్నాయని, ప్రజలు ఏనాడో మరిచిపోయిన వివాదాలను తిరగదోడి తమ స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నాయని, అలాంటి కొత్త వివాదాలు రేకెత్తకుండా ఉండేందుకే ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) బిల్లును ప్రవేశపెడుతున్నామని హోంమంత్రి ఎస్.బి. చవాన్ స్పష్టం చేశారు. ప్రేమ, శాంతి, సుహృద్భావ వాతావరణాన్ని ఏర్పర్చడమే ఈ బిల్లు లక్ష్యమని అన్నారు. బీజేపీ నుంచి ఆడ్వాణీ, జస్వంత్ సింగ్, ఉమాభారతి, రాంనాయక్ తదితరులుబీ కాంగ్రెస్ నుంచి దిగ్విజయ్ సింగ్, పిఎం సయీద్, మణిశంకర్ అయ్యర్‌బీ సీపీఐ(ఎం) నుంచి సోమనాథ ఛటర్జీబీ సీపీఐ నుంచి ఇంద్రజిత్ గుప్తా, గీతా ముఖర్జీ అత్యంత ప్రతిభావంతంగా చర్చలో పాల్గొన్నారు. ఆ చర్చల ప్రామాణికతతో పోలిస్తే ఇవాల్టి చర్చలు పేలవంగా కనిపిస్తాయి. ఈ బిల్లు వల్ల మనం సాధించేది ఏమీ లేదని, కొత్త వివాదాలు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని ఆడ్వాణీ అన్నారు. ప్రతి వివాదానికీ పరిష్కారం లభించాల్సిందేనని, అన్ని మత ప్రదేశాల పూర్వ వైభవాన్ని పునరుద్ధరించాలని ఉమాభారతి స్పష్టం చేశారు. తర్వాతి కాలంలో బీజేపీకి మిత్రుడుగా మారిన అప్పటి జనతాదళ్(యు)కు చెందిన దళిత నేత ఒకరు ఈ బిల్లును బలంగా సమర్థించారు. ఈ దేశంలో 33 కోట్లమంది దేవుళ్లు ఉన్నప్పటికీ దేశంలోని 5,76,000 గ్రామాలకు స్వచ్ఛమైన నీరు అందడం లేదని గుర్తు చేశారు. లక్షలాది ప్రజలు ఆకలితో, వైద్య చికిత్సలు లేకుండా, ఉపాధి లభించకుండా మరణిస్తున్నారని, ఇలాంటి తీవ్రమైన అంశాలను పరిష్కరించకుండా మతపరమైన ఘర్షణల్లో కూరుకుపోవడం శోచనీయమని, ఎక్కడ మసీదు ఉందో, ఎక్కడ ఆలయం ఉందో తేల్చడం ప్రధానం కాదని సీపీఐ(ఎం) నేత సోమనాథ ఛటర్జీ అన్నారు. అదే సమయంలో అయోధ్య వివాదాన్ని చర్చల ద్వారా లేదా న్యాయవ్యవస్థ ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ప్రార్థనాస్థలాల బిల్లు ఆమోదం పొందిన తర్వాత ఒక్క అయోధ్యలో మినహా దేశంలో దాదాపు మూడు దశాబ్దాల పాటు ఎక్కడా ప్రార్థనాస్థలాల విషయంలో వివాదాలు రేగలేదు. ఒక్క అయోధ్య అంశం వల్లనే బీజేపీ క్రమక్రమంగా ఎన్నికల రాజకీయాల్లో పుంజుకొన్నది కనుక ఇతర అంశాలను పక్కన పెట్టింది. అయోధ్యతో బస్ ఝూంకీ హై, కాశీ మధురా బాకీ హై అని ఒకప్పుడు బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు నినాదాలు చేసేవారు. కాని మేనిఫెస్టోలో మాత్రం ఇతర ప్రార్థనా స్థలాల గురించి ప్రస్తావించకుండా సంయమనం పాటించారు. కాశీ, మధుర మాటేమిటి? అని 2022 లో బీజేపీ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డాను ప్రశ్నించినప్పుడు ఏ వివాదమైనా కోర్టులు, రాజ్యాంగం ద్వారా పరిష్కరించుకోవాల్సిందేనని చెప్పారు. అయోధ్య ఉద్యమం ఒక మినహాయింపు మాత్రమేనని, ప్రతి మసీదులోనూ శివలింగం గురించి వెతకడం సరైంది కాదని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. ఆసేతు హిమాచలాన్ని సమైక్య పరిచే శ్రీరాముడు వివాదాల్ని సృష్టించడని, ఆయన పరిష్కారాలు సూచిస్తారని రామమందిర ప్రారంభం తర్వాత ప్రధాని నరేంద్రమోదీ కూడా అన్నారు. చారిత్రక తప్పిదాలను సవరించడం కన్నా శాంతి సామరస్యాలతో కలసికట్టుగా జీవించడంపై దృష్టి కేంద్రీకరించాలని ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ వంటి బీజేపీ నేతలు కూడా అన్నారు.

# మీ కోసం ఆదివాసీలు నిర్వాసితులు కావాలా?



2024 జనవరి నుంచి మొదలై మాడ్‌తో సహా యావత్ దండకారణ్య ప్రాంతంలో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌లో భాగంగా సైనిక దాడులతో రక్తసిక్తమవుతున్న అడవుల నుంచి ప్రజలను ఖాళీ చేయించే చర్యలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాయపూర్‌లో జరిపిన ఏడు మావోయిస్టు ఉద్యమ రాష్ట్రాల పోలీసు అధికారుల సమావేశం నేపథ్యంలో అర్థం చేసుకోవాలి. దేశంలో మావోయిస్టులను, మావోయిజాన్ని 2026 మార్చ్ నాటికి అంతమొందిస్తామని ఆ సమావేశం ప్రకటించింది. అందుకోసం ప్రస్తుత కగార్ దాడులను రెట్టింపు వేగంతో, తీవ్రతతో కొనసాగించాలనీ నిర్ణయించింది. ఈ దాడులను 'మాడ్ బచావో' కేంపెయిన్ పేరుతో కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. వారి లక్ష్యాన్ని చేరడానికి మాడ్ కొండలలో భారత సైన్యాల శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, మాడ్ ప్రాంతం నుంచి ప్రజలను బలవంతంగా ఖాళీ చేయించే చర్యలను చేపడుతున్నారు. తిరిగి మూడేళ్లకు మీ ప్రాంతాలకు మీరు చేరుకుంటారనీ ప్రజలను మభ్యపెడుతున్నారు. భారత సైన్యాలు మావోయిస్టు ఆపరేషన్‌లలో పాల్గొనవని కేంద్ర హోంమంత్రి బుకాయిస్తున్నారు కానీ, ఇప్పటికే అనేక సంవత్సరాలుగా వేరు వేరు రూపాలలో భారత సైన్యాలు నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లలో పాల్గొంటున్న విషయం బహిరంగ రహస్యమే. కార్పొరేట్ వర్గాల ప్రయోజనాల కోసం వివిధ ప్రాజెక్టుల పేరుతో దేశంలో నిర్వాసితులైన వారిలో ఆదివాసీలే అధిక సంఖ్యలో ఉన్నారు. దండకారణ్యంలో 1970లలో చేపట్టిన కిరండాల్ తవ్వకాలతో పెద్ద ఎత్తున ఆదివాసీలు నిర్వాసితులయ్యారు. ఇంచుమించు అదే సమయంలో మార్దూంలో అత్యంత రహస్యంగా భారత రక్షణరంగ యూనిట్‌ను నిర్మించినపుడు ఆదివాసీలు నిర్వాసితులయ్యారు. 1980ల నాటికి మాడ్ కొండలపై నుండి ఆదివాసీలను మైదాన ప్రాంతాలకు తరమడానికి అన్ని సన్నాహాలు జరిగాయి. అడవుల నుంచి మనుషులను తరిమివేసి పులులను పెంచి పోషించే ప్రభుత్వ విధానాలతో 1980లలోనే వర్తమాన బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ ఏరియా నుంచి పదుల గ్రామాలను ఖాళీ చేయించ పూనుకున్న పరిస్థితులలో ఆదివాసీలు సంఘటితంగా దానిని ఎదుర్కొన్నారు. తిరిగి ఇపుడు వారికి తమ గ్రామాలను ఖాళీ చేయాలనే ఆదేశాలు జారీ అయ్యాయి. గత నాలుగేళ్ల నుంచి అనేక కార్పొరేట్ వర్గాల ప్రయోజనాల కోసం వేగంగా కొనసాగిస్తున్న గనుల తవ్వకాలతో బృహత్ బస్తర్‌లో, గడ్‌చిరోలీలో కాలుష్యం ప్రబలుతూ ప్రజల పంట భూములు వల్లకాడై పోతున్నాయి. జనావాసాలు నివాసయోగ్యం కాకుండా పోతున్నాయి. వచ్చని అడవులు నాశనమవుతున్నాయి. 2030 నాటికి గడ్‌చిరోలీ జిల్లాను పారిశ్రామిక జిల్లాగా మారుస్తామని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే ప్రకటించాడు. ఈ పరిణామాలతో ఈ ప్రాంతాలలోని ఆదివాసీలు ఏ పట్టణాలకో, ఏ నగరాలకో, ఏ మురికివాడల జీవితాలకో బలి కానున్నారు. చాలా బాధాకరమైన విషయం ఏమంటే, ఈ ప్రాంతాలలోని ఆదివాసీ తెగలు భారత రాజ్యాంగం ప్రకారం అంతరించిపోతున్న తెగల జాబితా లోకి వస్తారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ఆదివాసీల జీవితాన్ని పణంగా పెడుతూ వారి అస్తిత్వాన్నే ధ్వంసం చేస్తున్నారు. గతంలో ఫాసిస్ట్ సల్వాజుడుం సమయంలో సుక్మా, దంతెవాడ, బీజాపూర్ జిల్లాల్లోని వేలాదిమంది ప్రజలను తమ అడవుల నుంచి, గ్రామాల నుంచి తరిమి 'సహాయశిబిరాల' పేరుతో రోడ్డుపక్కన నిర్మించిన 'షెల్టర్'లలోకి తరలించారు. ఆ షెల్టర్లన్నీ నరక కూపాలే. వాస్తవంగా అవన్నీ కాన్‌సెంట్రేషన్ క్యాంపులే. అక్కడ ప్రజలకు ఎలాంటి అవకాశాలు ఉండవు. మహిళల జీవితాలలో కనీస భద్రత కరువైంది. అడవులలో స్వేచ్ఛగా తిరుగుతూ తమ దైనందిన అవసరాలను తీర్చుకునే ఆదివాసీలకు 'సహాయ శిబిరాల' జీవితాలు మృత్యు కుహరాల్లాంటివే. బలవంతంగా ఆ శిబిరాలకు తరలించబడిన ప్రజలు అక్కడ ఉండలేక వివిధ రూపాలలో తిరిగి తమ అడవులకు, గ్రామాలకు చేరుకున్నారు. వారికి విప్లవోద్యమంతో సహా అనేకమంది ప్రజాస్వామికవాదులు, ఆదివాసీ శ్రేయోభిలాషులు సహకరించారు. "1950లో భారతదేశ ప్రజాస్వామ్యానికి నైతిక పునాది అయిన భారత రాజ్యాంగాన్ని పార్లమెంటు ఆమోదించిన రోజు నిజానికి ఆదివాసులకు దురదృష్టకరమైన రోజు. రాజ్యాంగం వలస విధానాన్నే స్థిరీకరిస్తూ ఆదివాసుల నివాస ప్రాంతాలకు రాజ్యం సంరక్షకురాలిగా ఉంటుందని తేల్చింది. ఉన్నట్టుండి మొత్తం ఆదివాసీ సమూహాలన్నింటినీ వాళ్ల సొంత నేల మీదే పరాయివాళ్లను చేసింది. అటవీ ఉత్పత్తుల మీద వారి సంప్రదాయ హక్కును నిరాకరించి వారి జీవన విధానాన్నే నేరమయం చేసింది. ఓటుహక్కుకు బదులుగా, వాళ్ల జీవించే హక్కును, ఆత్మగౌరవాన్ని లాగేసుకుంది" %-% అని అరుంధతీరాయ్ 'వాకింగ్ విత్ కామ్రేడ్స్' పుస్తకంలో సరిగ్గా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం మాడ్ కొండలలోని ప్రజలు కోరుతున్నదేమిటి? వారు తమ 'కొండలను ఖాళీ చేయం' అంటున్నారు. వారు తమ భూములను వదలం అంటున్నారు. తమ అడవులను కాపాడుకోవాలంటున్నారు. ప్రకృతి వనరులను దేశం కోసం, ప్రజల కోసం, భవిష్యత్ తరాల కోసం నిలుపుకోవాలంటున్నారు. మాడ్ కొండలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన అన్ని చర్యలను తక్షణం నిలిపివేయాలని కోరుతున్నారు. మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్‌లలో భారత సైన్యాలు పాల్గొంటాయా, లేదా అనేది వేరే విషయం. దానితో, ఈ అంశాన్ని ముడిపెట్టడం ప్రభుత్వాల మోసకారి విధానమే అవుతుంది. మధ్య భారత అడవులలో భారత సైన్యాల శిక్షణా శిబిరం ఏర్పాటును ఒక దీర్ఘదృష్టితో వ్యూహాత్మక పథకంతో రూపొందిస్తున్నారు. గత అనేక సంవత్సరాలుగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పాలకవర్గాలు దానినుంచి బయటపడడానికి ఒకవైపు దేశంలోని విశాలమైన అడవులలోని విలువైన సంపదలను తరలించుకుపోవడానికి పూనుకుంటూనే, అందుకు వ్యతిరేకంగా ప్రబలుతున్న ప్రజా నిరసనను నిర్దాక్షిణ్యంగా అణచివేయడంలో భాగంగా ముందునుంచే భారత సైన్యాలకు గెరిల్లా యుద్ధ తంత్రంలో శిక్షణను అందిస్తున్నారు. అనేక దేశాలలో ప్రజలు సంక్షోభాలకు వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్నారు. వర్తమాన పరిస్థితులలో అలాంటి వెల్లువ భారతదేశంలో కూడా సంభవించడానికి పూర్తి అవకాశాలున్నాయని గ్రహించే ఇలాంటి ముందస్తు చర్యలకు దిగుతున్నారు. ఇలాంటి పరిస్థితులలో, దేశంలోని సమస్త ప్రగతిశీల శక్తులు, విద్యార్థి, మేధావి, కార్మిక, కర్షక శక్తులు, రచయితలు, కళాకారులు మాడ్ ప్రజల న్యాయమైన అస్తిత్వ సమస్యను సమర్థిస్తూ వారికి అండగా నిలువాలనీ, మాడ్ కొండలలో భారత సైన్యాల శిక్షణా శిబిరాన్ని రద్దు చేయడానికి ఉద్యమించాలనీ మా విన్నపం.

# రంగన్న ఆశలు నెరవేరుతాయా?

మహబూబ్‌నగర్ జిల్లాకు సాగునీరు సాధించటం అనే ఆశయానికి నిబద్ధమైన వ్యక్తి నల్లవెల్లి రంగారెడ్డి. 1951లో గన్యాగుల గ్రామంలో జన్మించాడు. మధ్య తరగతి కుటుంబం అనుభవించే ఈతిబాధలన్నీ అనుభవించాడు. 1976లో డిప్యూటీ ఇంజనీర్‌గా సాగునీటి శాఖలో ప్రవేశించి వనపర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, గద్వాల, హైదరాబాద్, శ్రీకాళహస్తి, నల్లగొండ తదితర చోట్ల విధులు నిర్వహించి, 38 సంవత్సరాలు వివిధ హోదాలలో పనిచేసి, సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా ఉద్యోగ విరమణ చేశాడు ఉమ్మడి రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులను, ఎత్తిపోతల పథకాలను పరిశీలించాడు. ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు ఎందుకు మహబూబ్‌నగర్ జిల్లాను వివక్షకు గురి చేస్తున్నాయని చింతించేవాడు. ఆర్థిక వెనుకబాటుతో ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోకపోవడం వల్ల విధాన నిర్ణయాలను ప్రభావితం చేసేచోట జిల్లా ప్రజలు లేరని, అందువల్ల లోపల ఏం జరుగుతుందో మనకు తెలియడం లేదని అనేవాడు. రాజకీయ నాయకులకే పట్టింపు లేనప్పుడు మనం ఏం చేయగలమని బాధపడేవాడు. అయితే వారిని చైతన్యం చేస్తే మాట్లాడతారని ఆశపడ్డాడు. దీనికి ఎలిమినేటి మాధవరెడ్డి ఎత్తిపోతల పథకం విజయం కలిసి వచ్చింది. స్వయంగా తోటి ఇంజనీర్లతో కలిసి బస్సుల్లో ఎ.ఎం.ఆర్ పథకం పనితీరును జిల్లా రాజకీయ నాయకులకు చూపించాడు. అప్పటికే మేము కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలు చేపట్టాలని పార్టీలు, రాజకీయ నాయకులపై పోరాడుతూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాం. అయినా పదేళ్ల పాటు చిన్న రాయి కూడా వేయకుండా కేవలం శంకుస్థాపనల తంతు నడిపారు. చివరికి 2005లో పనులు ప్రారంభించి 2012 నాటికి కొంత మేర పూర్తి చేశారు. కృష్ణానది జలసాధన ఉద్యమంలోంచే తెలంగాణ ఉద్యమం పుట్టినా, తెలంగాణ ఏర్పడి పదేండ్లు దాటినా మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు సాగునీటి న్యాయం దక్కనే లేదు. తెలంగాణలో ఏర్పడిన తొలి ప్రభుత్వం జల వివాదాలున్న నీటి ఎద్దడి ప్రాంతం కోసం కాక, కాళేశ్వరం చేపట్టి నిధులు అటు మళ్లించిందని రంగారెడ్డి ఆవేదన చెందాడు. ఆయనను తీవ్రంగా కలచివేసిన విషయం... పాలమూరు%-%రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని 2013 ఆగస్టులో సాధించుకున్న 72 జీవోతో కాక, 2015 జూన్ 11న కేసీఆర్ విడుదల చేసిన 105 జీవోతో చేపట్టి, వంచించటం. ఇది సరి కాదని రామకృష్ణారెడ్డి, మల్లయ్య, రవీందర్‌రెడ్డి వంటి నిపుణులైన మహబూబ్‌నగర్ ఇంజనీర్లు ఎంత మొత్తుకున్నా కేసీఆర్ వినలేదు. ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని అరకొర నిధులతో పనులు నానబెట్టారు. ఈ పనుల కోసం ఆయన రంగారెడ్డినే ఓఎస్డీగా నియమించాడు. కానీ, ఎప్పటికప్పుడు వాస్తవాలు తెల్పటాన్ని జీర్ణించుకోలేక, రెండోసారి ఆయన పదవీకాలాన్ని పొడిగించలేదు. మూడేళ్లలో పూర్తి కావలసిన పథకం ఇంకా మూలన పడి ఉన్నది. పనులు పూర్తి కాకుండానే ఒక పంపు నీరు దుంకించి మన జిల్లాను అవమానించాడని రంగన్న బాధపడ్డాడు. మహబూబ్‌నగర్ రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ఏర్పడాలనే మా సంకల్పానికి సహకరించాడు. పాలమూరు%-%రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఇన్‌టేక్ పాయింట్‌ను జూరాల నుంచి కాక శ్రీశైలానికి మార్చడంతోనే వివాదాలు చుట్టుకున్నాయి. శ్రీశైలం అంతర్రాష్ట్ర ప్రాజెక్టు కావటం వల్ల ఆంధ్రా అడ్డుకుంది. ఎ.ఎం.ఆర్, ఎస్.ఎల్.బి.సి నీరు తీసుకునే అవకాశం ఉన్నా, ఒకరిద్దరు స్వార్థపరులు పాలమూరు%-%డిండి అనే కొత్త పథకం ముందుకు తెచ్చారు. డిండి ఎత్తు పెంచి నార్లాపూర్ లేదా ఏదుల లేదా వట్టెం నుంచి నీరు తరలించుకుపోయే ప్రతిపాదన తెచ్చారు. దీనిపై జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున పోరాడవలసి వచ్చింది. ఈ అంశంపై ప్రభుత్వానికి లేఖ రాయడానికి ఎమ్మెల్యేలను ఒప్పించడంలో రంగన్న పాత్ర ఉంది. కేసీఆర్ కూడా అసెంబ్లీలో ఆ ప్రతిపాదన ఉండదన్నారు. పాలమూరు పథకంలో చివరిదైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ఎందుకు చేపట్టలేదో రంగన్న వివరంగా చెప్పాడు. ప్రభుత్వం రియల్ ఎస్టేట్ లాబీ చేతిలో ఉందన్నాడు. బిఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా, భట్టి విక్రమార్క స్వయంగా హామీ ఇచ్చినా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనుల్లో చలనం లేదు. అసలు మహబూబ్‌నగర్ సాగునీటి పథకాలు చాలా చిన్నవి. ఆర్డీఎస్ పథకం దెబ్బతినిపోయింది. సుంకేశుల ఆనకట్టను భారీగా నిర్మించారు కానీ, ఆర్డీఎస్‌ను వదిలేశారు. కోర్టు తీర్పు ప్రకారం ఇవ్వాల్సిన నీరు కూడా ఇవ్వడం లేదు. జూరాల నిర్వహణ సరిగా లేదు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ పథకాల పంపుల సామర్థ్యం, కాలువల సామర్థ్యం, రిజర్వాయర్ల సామర్థ్యం చాలా చిన్నవి. వాటి స్థాయి మెరుగుదలకు ఏం చేయాలో కేసీఆర్ ఒక్కసారి కూడా సమీక్ష జరపలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఏమీ చేయలేదు. ఒక ఇంజనీర్ల బృందంతో అధ్యయనం చేయించి వారి సూచనలు అమలు చేయాలని కోరినా ఎవరూ పట్టించుకోలేదు పాలమూరు%-%రంగారెడ్డి పథకానికి కేటాయించిన 90 టిఎంసిల నీటిని రెండు భాగాలుగా విభజించి, సగం నీటిని జూరాలకు వచ్చే తొలి వరద నుంచి, మిగతా సగం నీటిని శ్రీశైలం నుంచి తీసుకుని కల్వకుర్తి పథకంతో సమన్వయపరచి నిర్వహించాలని కోరాం. మన వాటా నీరు నిలుపుకోవడానికి వెల్టూరు%-%గొందిమల్ల గ్రామాల మధ్య జోగులాంబ రిజర్వాయర్ నిర్మించాలని కోరాం. అమ్రాబాద్‌కు చంద్రసాగర్ నుంచి కల్వకుర్తి పథకం నీరు తరలించాలని చెప్పాం. ఈ ప్రతిపాదనలన్నీ గొప్పగా ఉన్నాయి. మున్ముందు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సాధించుకోవచ్చేమో అని నల్లవెల్లి రంగారెడ్డి ఆశ పడ్డాడు. ఆయనను మహబూబ్‌నగర్ సాగునీటి పథకాల సలహాదారుగా 2024 మే 14న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నియమించింది. అయితే అనారోగ్యంతో బాధ్యతలు చేపట్టకుండానే మే 27న రంగన్న మరణించాడు. ఇంజనీర్ రఘురాంరెడ్డి, ఇతర మిత్రులు రంగన్న మరణం వారి కుటుంబానికి, బంధువులకు మాత్రమే కాదు ఎంతో కాలంగా మోసపోతున్న మహబూబ్‌నగర్ రైతాంగానికి నష్టం అని కంటతడి పెట్టుకున్నారు. పోరాడి తెలంగాణ సాధించుకున్నాం కానీ, జిల్లాకు నీరు సాధించుకోలేకపోయాం, ఇప్పుడైనా అవుతుందేమో అనుకుంటే ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది అని టీజేఏసి మాజీ చైర్మన్ జి. రాజేందర్‌రెడ్డి బాధపడ్డారు. ఐదు దశాబ్దాల వృత్తి, ప్రవృత్తి జీవితానుభవంతో రంగారెడ్డి చివరికి ఒక ప్రతిపాదన చేశాడు. ఏటా వేల టిఎంసిల నీరు సముద్రం పాలవుతోంది. జూరాల ఎగువ నుంచి 200 టిఎంసిల నీరు తీసుకుని, నిలువ చేసుకునే వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటే మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలు బాగుపడతాయి. నీరు లేనప్పుడు లెక్క ప్రకారమే వాడుకోవచ్చు. ఉన్నప్పుడు తీసుకోకపోవడం ప్రభుత్వాల అసమర్థత కాదా అన్నాడు. ఈ సవాలును స్వీకరించి నిజాయితీగా పనిచేసే శక్తి రాష్ట్ర ప్రభుత్వానికి ఎప్పటికైనా వస్తుందా? ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషయం మీద దృష్టి సారిస్తారా? రంగన్న ఆశలు, కలలు నెరవేరుతాయా?

## షుగర్ పేషెంట్స్ స్వీట్స్ తింటే ఆందోళన వద్దు

మధుమేహ వ్యాధిగ్రస్తులు స్వీట్లు తినకూడదు. ఇది షుగర్ పేషెంట్స్ ఆరోగ్యానికి హానికరం. అయితే మధుమేహ వ్యాధిగ్రస్తులు అనుకోకుండా చక్కెర ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తిన్నట్లయితే, భయపడాల్సిన అవసరం లేదు. కొన్ని విషయాలను గుర్తుంచుకోవాలి. వీటిని పాటించడం వల్ల శరీరంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. అన్నింటిలో మొదటిది ఆహారంలో స్వీట్లు తిన్న తర్వాత, తదుపరి ఆహారంలో ప్రోటీన్ అధికంగా ఉండేలా ఆహారాన్ని తీసుకోవడం చాలా ముఖ్యం. పప్పులు, కిడ్నీ బీన్స్ తినండి. ఇవి శరీరంలో చక్కెర స్థాయిని అదుపులో ఉంచుతాయి. ఆహారంతో పాటు వ్యాయామం కూడా ముఖ్యం. డయాబెటిక్ పేషెంట్ ఎక్కువగా స్వీట్లు తిన్నట్లయితే చురుకైన నడక షుగర్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుందని డాక్టర్ స్వప్నిల్ జైన్ చెప్పారు. స్వీట్లు తిన్న 4 గంటల్లో ఈ వ్యాయామం చేయవచ్చు. బ్రిస్క్ వాక్ ద్వారా షుగర్ లెవల్స్ అదుపులో ఉంటాయి. బ్రిస్క్ వాక్ అనేది ఒక రకమైన ఫాస్ట్ వాకింగ్. ఇది అలాంటి నడకలో చాలా వేగంగా నడవాలి. గుండె కొట్టుకోవడం పెరుగుతుంది. అయితే పరుగు పెట్టకూడదు. వేగంగా నడవాలి. అరగంట పాటు వేగంగా నడవవచ్చు.

# యువత వ్యాపారంలో రాణించాలి



సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ప్రధాన రహదారి పక్కన చాయ్ బంక్ హోటల్ వద్ద ఇటీవల నూతనంగా ప్రారంభించిన శ్రీ వెంకటేశ్వర టిఫిన్ సెంటర్ ను బుధవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్ సందర్శించి వెంకటేశ్వర టిఫిన్ సెంటర్ యజమాని బత్తిని నరేష్ కుటుంబ సభ్యులను అభినందించారు, అనంతరం గాడిపల్లి భాస్కర్ మాట్లాడుతూ యువత వ్యాపారంలో రాణించి స్వశక్తితో ముందుకు వెళ్లాలని నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర టిఫిన్ సెంటర్ వినియోగదారుల మన్నన పొందే విధంగా స్వచ్ఛమైన వస్తువులతో, రుచికరమైన టిఫిన్స్ సరసమైన ధరలకు అందజేసి, మంచి గుర్తింపు పొందాలని అన్నారు, ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్, నాయకులు వెంకటేశ్వర్లు, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు

# అహిల్యా బాయ్ హెూల్కర్ జయంతి ఉత్సవాల కరపత్రాల పంపిణీ



సామాజిక సమరసతా వేదిక గజ్వేల్ అధ్వర్యంలో లోకమాత అహిల్యా బాయి హెూల్కర్ త్రిశతాబ్ది జయంతి ఉత్సవాల కరపత్రాలు పంపిణీ కార్యక్రమం గజ్వేల్ పట్టణంలో నిర్వహించారు "లోక మాత ,ధీర వనిత అహిల్యా బాయి హెూల్కర్" త్రిశతాబ్ది జయంతి ఉత్సవాల సందర్భంగా, పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా సామాజిక సమరసతా నవేదిక గజ్వేల్ అధ్వర్యంలో గజ్వేల్ కు చెందిన ప్రముఖ వ్యక్తులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సామాజిక సమరసతా వేదిక గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ మంద సాయి నాథ్ రెడ్డి మాట్లాడుతూ అహిల్యా బాయి హెూల్కర్ స్త్రీల సాధికారతకు, స్త్రీ స్వాభిమానానికి ప్రతీక అని తెలిపారు, అనంతరం సామాజిక సమరసతా వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేశ్ బాబు మాట్లాడుతూ సామాజిక సమరసతా వేదిక 1983 వ సంవత్సరంలో బి ఆర్ అంబేద్కర్ జయంతి అయిన ఏప్రిల్ 14 వ తేదీన ప్రారంభమై దెశ వ్యాప్తంగా మన సమాజంలో ఉన్న అంటరాని తనం, కుల వివక్షను నిర్మూలించి హిందూ సమాజంలో బంధుబావణ నిర్మాణం చేయడం కోసం పనిచేస్తున్నదని తెలిపారు. మూడు వందల సంవత్సరాల క్రితమే మేకలు గొర్రెలు మేపుకునే కుటుంబంలో జన్మించిన అహల్యా బాయి హెూల్కర్ డెబ్బై సంవత్సరాలు జీవించి, ముప్పైమూడు సంవత్సరాలు సమర్థవంతంగా రాజ్యపాలన చేసి సామాజిక సమరసతకు విశేషంగా కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి,పురోహితులు రాజశేఖర శర్మ, నాయకులు నాయిని యాదగిరి, సుభాష్ చంద్రబోస్, బొమ్మ రమణ, బాల కుమార్ తదితరులు పాల్గొన్నారు

# నారాయణ విద్యాసంస్థలను రద్దు చేయాలి

**– పుల్లూరి సింహాద్రి పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షుడు**




సూర్యాపేట, తెలంగాణ సేన న్యూస్ : వరుసగా విద్యార్థుల ఆత్మహత్యలకు కారణం అవుతున్న నారాయణ, విద్యాసంస్థలను రాష్ట్రవ్యాప్తంగా రద్దు చేయాలని పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి అన్నారు.సూర్యాపేట జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో పి.డి.ఎస్.యు సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల ఆత్మహత్యలకు నిలయంగా మారి విద్యార్థుల ప్రాణాలను బలి తీసుకుంటుంది. విచ్చలవిడిగా ఏర్పాటు అయిన కార్పోరేట్ నారాయణ విద్యాసంస్థల దోపిడీ వ్యవహారం. పేద, మధ్య తరగతి విద్యార్థులే లక్ష్యంగా చేసుకొని వారి వద్ద లక్షల రూపాయలు దండుకుంటునాయి. ఇలాంటి కార్పోరేట్ వ్యవస్థలు ఆర్థికంగ, మానసికంగ విద్యార్థులను ముప్పు తిప్పలు పెడుతున్నాయి. ఉజ్వల భవిష్యత్ ఉండాల్సిన నవ యవ్వన బాల మొగ్గలని, ర్యాంకుల పేరిట ఒత్తిడికి గురి చేసి ఆత్మహత్యలకు పాల్పడేలా ప్రేరేపిస్తున్నాయి. ప్రతి సంవత్సరం వందల మంది విద్యార్థులు చనిపోతున్నారని అయినా కూడా ఈ ప్రభుత్వం ఈ విద్యాసంస్థలు వేసే కుక్క బిస్కెట్ల మీద ఆశపడి, ఆధారపడడం వలన వీటి మీద నియంత్రణ కరువైంది. తక్షణమే ఈ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలలో ఫీజులు నియంత్రించేందుకు ఫీజుల నియంత్రణ కమిటీ లేదా చట్టాన్ని తీసుకొచ్చి ఈ విద్యాసంస్థలని నియంత్రించాలని డిమాండ్ చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నారాయణ విద్యా సంస్థలను రద్దు చేయాలని అలాగే సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నారాయణ, దోపిడి విద్యా సంస్థల నిర్వాహకులు నిబంధలకు విరుద్ధంగా సెలవు రోజు కూడా ప్రత్యేక తరగతులు కొనసాగిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారు. దీనిపైన తక్షణమే జిల్లా విద్య ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.ఈ విషయంపై బాలల హక్కుల సంఘం కూడా జోక్యం చేసుకొని విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు నాయకులు మహేష్ నవీన్ పవన్ వినయ్ ప్రవీణ్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో సిపిఐ ది ఘనమైన చరిత్ర

**– ఈనెల 30న నల్గొండలో జరిగే 100 వసంతాల ఉత్సవాలను జయప్రదం చేయండి**

**– సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు**




సూర్యాపేట, తెలంగాణ సేన : భారతదేశంలో సిపిఐ పార్టీ ఘనమైన చరిత్ర అని సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో పట్టణ కౌన్సిల్ సమావేశం దంతాల రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పాల్గొని మాట్లాడుతూ భారతదేశ స్వతంత్ర సంగ్రామంలో అగ్రభాగాన నిలబడి జైలు జీవితాలు అనుభవించి ప్రాణ త్యాగాలు చేసిన పార్టీ సిపిఐ ది అని కొనియాడారు. ఆనాటి నుండి నేటి వరకు ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడిన ఘనత సిపిఐ పార్టీకి ఉందని ఆయన అన్నారు. ఈనెల 26 కు పార్టీ పుట్టి 100 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా డిసెంబర్ 30న నల్లగొండలో ఉమ్మడి జిల్లా భారీ బహిరంగ సభ వేడుకలకు భారీగా కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. నేడు మతోన్మాదులు , విచ్ఛిన్న కార శక్తులు భారి నుండి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి యువతరం పై ఉన్నదని ఆయన గుర్తు చేశారు. ఈ సమావేశంలో పట్టణ కార్యవర్గ సభ్యులు దోరపల్లి శంకర్, చామల అశోక్ కుమార్, చివ్వెం మండల కార్యదర్శి ఖమ్మం పట్టి రాము, జి రాజారామ్, పట్టణ కౌన్సిల్ సభ్యులు ఎండి పాషా, పెంద్ర కృష్ణ, ఎడెల్లి శ్రీకాంత్, వాడపల్లి వెంకన్న, వాడపల్లి గోపి, తదితరులు పాల్గొన్నారు.

# ఇరుమూడిలో పాల్గొన్న గుగులోత్ కృష్ణ నాయక్



సూర్యాపేట,తెలంగాణ సేన న్యూస్: సూర్యాపేట పట్టణంలోని శభరి నగర్ అయ్యప్పస్వామి దేవాలయంలో నూతనకల్ మండలం బక్కహేమ్లా తండా గ్రామానికి చెందిన మండల ఎస్ టి సెల్ అధ్యక్షులు మూడ్ శంకర్ నాయక్ స్వామి ఇరుమూడి కార్యక్రమానికి హాజరైన జిల్లా కార్యదర్శి గుగులోత్ కృష్ణ నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పసుల అశోక్ యాదవ్, తుంగతుర్తి నియోజకవర్గ సోషల్ మీడియా మూడ్ మోహన్ నాయక్ కాంగ్రెస్ నాయకులు దామోదర్ నాయక్, రవి, శ్రీనివాస్, వీరన్న, రాములు, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు

# సివిల్ సప్లై హమాలీ కార్మికుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాము




ములుగు జిల్లా ప్రతినిధి : తెలంగాణ సేన న్యూస్ సివిల్ సప్లై హమాలీ కార్మికుల లోడింగ్, అన్లోడింగ్ చార్జీలు పెంచాలనే లక్ష్యం తో శాంతియుతంగా ఆందోళన చేయడం లో బాగంగా చలో హైదరాబాద్ కార్యక్రమానికి సిద్ధం అవుతున్న హమాలీ కార్మికులను అర్ధం రాత్రి అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాము అని ఏఐటియుసి జిల్లా నాయకులు ముత్యాల రాజు అన్నారు, ప్రభుత్వం రెండు సంవత్సరాలకు ఒకసారి పెంచవలసిన రేట్లను నాలుగు సంవత్సరాలుగా పెంచకపోతే హమాలీ కార్మికులు ఆందోళనలు చయక మీరేం చేయాలన్నారు ప్రభుత్వం న్యాయమైన సమస్యలు పరిష్కారం చూపకుండా పోలీసు నిర్బంధాలు చేయడం చాలా అన్యాయం అన్నారు. అరెస్ట్ అయిన కార్మికులు మొలుగూరి రాంబాబు, రొంటాల రమేష్,ఇనుముల భిక్షపతి,రఘు, ఓరుగంటి రవి,, కుమార్, నరేష్,సుమన్, భిక్షపతిలు

# మానుకోట జిల్లా కేంద్రంలో,సమగ్ర శిక్షా ఉద్యోగుల 13వ రోజు సమ్మెలో భాగంగా మానవహారం, భిక్షాటన, అంబేద్కర్ గారికి వినతి పత్రం తో నిరసన

**– జిల్లా అధ్యక్షుడు మహంకాళి వీరన్న**







మహబూబాద్ టౌన్ (తెలంగాణ సేన) డిసెంబర్ 18 సమగ్ర శిక్ష ఉద్యోగులు స్థానిక మానుకోట జిల్లా కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం వద్ద చేస్తున్నటువంటి 13వ రోజు సమ్మెలో భాగంగా బుధవారం రోజున మానుకోట జిల్లా కేంద్రంలో భిక్షాటన చేస్తూ అంబేద్కర్ గారి విగ్రహానికి వినతి పత్రం అందజేయడం జరిగింది సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మహంకాళి వీరన్న మాట్లాడుతూ సీఎం గారు ఇచ్చినటువంటి మాటను నిలబెట్టుకొని రాష్ట్రంలో ఉన్న 19,000 మంది సమగ్ర శిక్ష ఉద్యోగుల జీవితాల్లో వెలుగు నింపాలని డిమాండ్ చేశారు మా సమస్యల పరిష్కారం తొందర్లోనే చేయకపోతే భవిష్యత్తులో జరిగే కార్యక్రమాలకు పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాలు మద్దతుగా వచ్చారు. గార్ల మండలం ఉపాధ్యాయ సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు చంద్రశేఖర్ ఉద్యోగులకు భోజనాలు అందజేశారు. ఈ ఈ సమ్మెలో సమగ్ర శిక్ష లోని వివిధ విభాగాల ఉద్యోగులు నితిన్ ఉదయ్ సరస్వతి సుమలత విమల జ్యోతి పాల్గొన్నారు

# బలుసుకూరి కృష్ణ ప్రధమ వర్ధంతి



నర్సంపేట తెలంగాణ సేన పట్టణం యందు ఈరోజు 18 డిసెంబర్ 2024 బుధవారం రోజున ప్రధమ వర్ధంతి వేడుకలు చేయడం జరిగింది గతంలో నర్సంపేట డివిజన్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా బల్సుకూరి కృష్ణ గ్రూప్ ఫోటో స్టూడియో వారు గత 30 సంవత్సరాలు ఏకగ్రీవంగా కొనసాగుతూ అనారోగ్యంతో గతంలో మరణించగా కుమారుడు శ్రీనుబాబు ప్రధమ వర్ధంతి వేడుకలు జరపగా నర్సంపేట డివిజన్ ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ పాల్గొని పుష్పగుచ్ఛలతో శ్రద్ధాంజలి ఘటించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో అధ్యక్షులు గట్ల అమరేందర్ మాట్లాడుతూ బల్సుకురి కృష్ణ స్థాపించిన మన సంఘం లో ప్రతి ఫోటోగ్రాఫర్ నియమ నిబంధనలు పాటిస్తూ తన ఆశయాలు సాధిస్తూ వ్యాపార అభివృద్ధిలో ప్రతి ఒక్కరు ఉండాలని ఆశించారు ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న వారు గట్ల అమరేందర్ తక్కల్లపల్లి సోమేశ్వర్ సోమరాతి సమ్మయ్య, పడాల మురళి బేతి భాస్కర్, కుసుమ శంకర్, జావిద్, నరేష్ బేతి కన్నయ్య, శివ అనిల్ సతీష్ శ్రీకాంత్ చీరాల రాజు తదితరులు పాల్గొన్నారు

# 35వ మహా అన్నదాన ప్రసాద వితరణ



నర్సంపేట తెలంగాణ సేన పట్టణం యందు 18 డిసెంబర్ 2024 బుధవారం రోజున శ్రీ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయ ప్రాంగణం యందు ఆలయ సేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా ఆదేశాల మేరకు ఆలయ అధ్యక్షులు సైఫా సురేష్ కమిటీ బృందం చేతుల మీదుగా ఈరోజు దాతలుగా ఓం సాయి రియల్ ఎస్టేట్ నర్సంపేట ఓ డి సి ఎం ఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి రుద్ర ఓంప్రకాష్ మల్లేశ్వరి బార్ధాన్ అసోసియేషన్ నర్సంపేట శింగిరికొండ ఉపేందర్ ఒద్దుల కరుణాకర్ రెడ్డి కవిత ఏ కృష్ణ హైమా దంపతుల కూతురు శ్రావణి జన్మదినం వాంకుడోత్ అమిత్ కుమార్ స్వరూప బిజెపి రాష్ట్ర నాయకురాలు పోటు రవీందర్ రెడ్డి సాంబలక్ష్మి, భార్గవ ఇండస్ట్రీస్ శనిగరం, శ్రీ రామలింగేశ్వర ఈత పరపతి సంఘం మాదన్నపేట చెరువు అధ్యక్షులు తోటకూరి రాజు గిరగాలి సాంబయ్య గౌడ్ టింగల్ కారు గణేష్ పాండ్ వరంగల్ సిద్ధ రవీందర్ దీప్తి మాదూరి పావని వేణు కడప వెంకటేశ్వర సునితరామస్వామి, యాదగిరిరావు నరసింహారెడ్డి రాజేష్ ప్రభాకర్ వాసు సాంబ రెడ్డి సోమలింగం రాజు దగ్గు రవీందర్రావు వెంకటేశ్వరరావు జయపాల్ రెడ్డి అడుప కృష్ణ సైప సురేష్ కొల్లూరి లక్ష్మీనారాయణ కమటాల బుచ్చయ్య సభ్యులు కృష్ణారెడ్డి కొండం వీరేంద్ర స్వామి బూరగాని సారయ్య గోలి కుమారస్వామి లు నూతన వస్త్రాలు ధరించి స్వామివారి అభిషేక పూజలో పాల్గొనగా ఆలయ అర్చకులు ఫ్రాన్స్ చే ఆశీర్వచన జరుపగా నైవేద్యం శిరస్సుపై ధరించి పదినిమిట్టాంబడి పై జోతులు వెలిగిస్తూ టెంకాయలు సమర్పించగా నైవేద్యం స్వామివారికి సమర్పణ చేయగా మాలదర స్వాములకు భక్తులకి మహా అన్నదాన ప్రసాద వితరణ చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న వారు ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా ఆలయ అధ్యక్షులు సైఫా సురేష్ ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్ రెడ్డి కోశాధికారి దొడ్డ రవీందర్ గుప్తా మాదారపు చంద్రశేఖరం శ్రీరాం ఈశ్వరయ్య భూపతి లక్ష్మీనారాయణ శ్రీరాముల శంకరయ్య బండారుపల్లి చెంచారావు దొడ్డ వేణు మల్యాల రాజు ఆకుల ప్రభాకర్ భరత్ తీరం రవీందర్ రెడ్డి డాక్టర్ రవీందర్ ఆలయ కమిటీ అర్చకులు గురుస్వాములు గుమస్తా దేశి రాము, శ్రీధర్ మర్రి రాజు లక్ష్మీ వంటశాల బృందం దాతల కుటుంబ సభ్యులు బంధుమిత్రులు పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు

# తెలంగాణను వణికిస్తున్న చలి

- చలి తీవ్రత మరింత పెరిగే చాన్స్
- ఇంట్లో నుండి బయటకు రావాలి అంటే జనం వెనకడుగు
- గజగజ వణుకుతున్న ప్రజలు
- ఇబ్బందులు పడుతున్న సింగరేణి కార్మికులు...
- చలి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన....
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ముప్పు..
- ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని



ములుగు జిల్లా ప్రతినిధి : తెలంగాణ సేన న్యూస్ తెలంగాణలో చలి పంజా విసురుతున్నది. అల్పపీ దన ప్రభావంతో ఉష్ణోగ్ర తలు భారీగా పడిపోయాయి. హైదరాబాద్, లోనూ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 14 డిగ్రీల సెల్సియస్‌కు తక్కువ నమోదయ్యాయి. మరి ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో చిన్న పిల్లలకు, వృద్ధులకు, దీర్ఘకాలిక రోగులకు చలితో ప్రమాదని, సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యారన్నారు. రక్షణ చర్యలు తీసుకోకుంటే అంతే సంగతులని దీనికి తోడు న్యూమెనియా, ఆస్తమా తదితర వ్యాధులు సంక్రమించే చాన్స్ ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. పెరిగిన చలి తీవ్రతతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు వచ్చేం దుకు జంకుతున్నారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో 10 డిగ్రీల లోపు ఉమ్మడి జిల్లా లోనే అత్యల్పంగా 6.3 డిగ్రీలు నమోదైనట్లు వాతా వరణశాఖ వెల్లడించింది. మిగతా జిల్లాల్లో 15 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోద య్యాయి. రానున్న రోజుల్లో చలితీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నదని హెచ్చరించింది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# అంబేద్కర్ పై అమిత్ షా వ్యాఖ్యలు ఖండించిన పి డి ఎస్ ఎఫ్

హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ : డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పై అమిత్ షా వాఖ్యలు మనువాదానికి పరాకాష్ట.అమిత్ షా వాఖ్యలు వెనక్కి తీసుకోవాలనే డిమాండ్ తో డిసెంబర్ 19 నుంచి జనవరి 1 (బీమా కోరెగావ్ దివాస్)వరకు నిరసనలు తెలిపాలని ప్రజలకు పిలుపునిస్తున్నాము : పిడిఎస్ఎఫ్ సామాజిక విప్లవకారుడు,భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పట్ల కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా వాఖ్యలను పిడిఎస్ఎఫ్ విద్యార్థి సంఘం పక్షాణ తీవ్రంగా ఖండిస్తున్నాము.దేశంలోని మెజారిటీ బహుజనులను అణచి వేయడంలో భాగంగా ఆర్ఎస్ఎస్ భాజపా పాలకుల అణగారిన వర్గాల హక్కుల ప్రతీకగా ఉన్నటువంటి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారిని చులకన చేసి మాట్లాడుతున్నారు.గత 11 ఏళ్లుగా కేంద్రంలోని భాజపా పాలకులు సామాజిక న్యాయాన్ని తుంగలో తొక్కుతున్నారు.భారత రాజ్యాంగంలోని స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం అనే పదాలను తొలగించాలని బహిరంగ కుట్రలకు పాల్పడ్డారు.అదే సమయంలో దేశంలోని దళిత బహుజన వర్గాలపై ప్రతిరోజు దాడులు,అత్యాచారాలు,అట్రాసిటీ దాడులు కొనసాగుతూ తీవ్రమవుతుండగా ఆ పీడత వర్గాల-కులాల ప్రజలు అంబేద్కర్ స్ఫూర్తితో మనువాద పాలకులకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు.విశ్వవిద్యాలయాల నుంచి మొదలుకొని గ్రామీణ ప్రాంతాల వరకు ప్రజలను అనేక రకాలుగా బ్రాహ్మణీయ హిందుత్వ పాలకులు అడుగడుగునా అణచివేస్తున్నారు.ఆ పరంపరలో భాగంగానే అమిత్ షా గారు అంబేద్కర్ మీద చులకన వ్యాఖ్యలు చేశారు.పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న అమిత్ షా గారు తన వాఖ్యలు వెనక్కి తీసుకోకవడంతో పాటు ఈ అంశాన్ని పక్కదారి పట్టించడంకోసం ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తూ పక్కదారి పట్టిస్తున్నారు.వెంటనే అమిత్ షా ను ఎంపీ పదవికి, కేంద్రమంత్రి పదవికి అనర్హుడిగా ప్రకటించాలని పిడిఎస్ఎఫ్ విద్యార్థి సంఘం పక్షాన డిమాండ్ చేస్తున్నాము.విద్యార్థులు యువత ప్రజలు ప్రజాస్వామ్యవాదులు ఇకనైనా మేలుకొని కేంద్రంలో మనువాదపాలకుల కుట్రలను బహిర్గతం చేస్తూ అంతరాలు లేని నూతన సమాజ నిర్మాణం కోసం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిస్తున్నాము.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అమిత్ షా వాఖ్యలు ఖండిస్తూ డిసెంబర్ 19 నుంచి జనవరి 1 (బీమా కోరెగావ్ దివాస్)వరకు నిరసనలు తెలిపాలని ప్రజలకు పిలుపునిస్తున్నాము. ఉద్యమాభివందనాలతో...

**ఆవుల నాగరాజు, ఎ.కుమార్**
**రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు.**
**ప్రొగ్రెస్సివ్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్,**
**తెలంగాణ రాష్ట్ర కమిటీ.**

# ఆ ఇద్దరు కలిసి దేశ పరువు తీశారు

-మొదటిపేజీ తరువాయి

కలిసి దేశ పరువు తీశారని విమర్శించారు. జేపీసీ వేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందన్నారు. అదానీ విషయంలో ప్రధానిని అడిగినా, కడిగినా కనీసం మాట్లాడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దేశ పరువు మంటకలిపిన అదానీపై విచారణ జరపాలని రేవంత్ డిమాండ్ చేశారు. భారత వ్యాపార సంస్థలు అవినీతిలో కూరుకుపోయాయని ఆరోపించారు. అదానీ సంస్థలు అమెరికాలో లంచాలు ఇవ్వజూపాయని... చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎఫ్బీఐ నివేదించడంతో అమెరికా ప్రభుత్వం చర్యలకు పూనుకుందని చెప్పారు. అదానీ అవినీతిపై చర్చించేందుకు, జేపీసీ వేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని... అలా చేస్తే అదానీ జైలుకు వెళ్లడం ఖాయమని రేవంత్ అన్నారు. అరెస్టుల నుంచి తప్పించుకోవడానికి బీజేపీకి బీఆర్ఎస్ నేతలు లొంగిపోయారని... అందుకే అదానీకి వ్యతిరేకంగా మాట్లాడటం లేదని విమర్శించారు. అదానీ అవినీతిపై జేపీసీ కోసం సభలో ఏకగ్రీవ తీర్మానం చేద్దామని అన్నారు.

**ప్రజల వైపా.. వారి వైపా..**

తమ డిమాండ్ కోసం నిరసన తెలపడం, చట్ట సభలను స్తంభించడం చేస్తామన్నారు. ఎన్ని నిరసనలు చేసినా మోదీ దిగిరావడం లేదన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా రాజ్ భవన్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనాల్సి వచ్చిందన్నారు. దేశం కోసం రోడెక్కుతామని.. చట్ట సభల్లో నిరసన తెలియచేస్తామని స్పష్టం చేశారు. "బీఆర్ఎస్ సన్నాసులు ముఖ్యమంత్రి నిరసన ఎలా చేస్తారు అని అంటున్నారు. నేను చేయను. మీరు చేయండి. అదానీ విషయంలో కేసీఆర్ స్టాండ్ ఏంటో చెప్పాలి. బీజేపీ పెద్దల కాళ్ళు మొక్కి అరెస్టును తప్పించుకునే



ప్రయత్నం చేస్తున్నారు. ప్రజల వైపా? అదానీ ప్రధాని వైపా కేసీఆర్, కేటీఆర్, హరీష్, కవిత చెప్పాలి. అదానీకి వ్యతిరేకంగా మాట్లాడితే మోదీ జైల్లో వేస్తారని కేసీఆర్ కుటుంబం భయపడుతోంది"అంటూ వ్యాఖ్యలు చేశారు.

**అందుకే రోడ్లపైకి వచ్చాం...**

త్వరలో రాష్ట్రపతి భవన్ కూడా ముట్టడిస్తామన్నారు. అదానీ విషయంలో వైఖరి ఏంటో రేపు పొద్దున్న వరకు కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. అదానీ విషయంలో బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు రాజ్యసభ చైర్మన్‌కు లేఖ రాయాలన్నారు. ప్రజాకోర్టులో ప్రధానిని శిక్షించేదాక కాంగ్రెస్ పార్టీ కొట్లాడుతుందని.. ప్రధాని పట్టించుకోవడం లేదనే రోడ్లపైకి రావాల్సి వచ్చింది అంటూ సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

**పోటాపోటీ నిరసనలు...**

మరోవైపు రాజ్‌భవన్ వద్ద కాంగ్రెస్ ఆందోళన చేస్తుండగా.. అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ నిరసనకు దిగింది. అదానీ విషయంలో కేసీఆర్ స్టాండ్ చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేయగా... అదే సమయంలో అసెంబ్లీలో బీఆర్ఎస్ నిరసన చేపట్టింది. అదాని రేవంత్ భాయ్ భాయ్ అంటూ నినాదాలు చేశారు. ప్రధాని, రేవంత్ రెడ్డి కలిసిన ఫోటోలు ప్రదర్శిస్తూ అసెంబ్లీ లాబీల నుంచి మీడియా పాయింట్ వరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ర్యాలీగా వెళ్లారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటాపోటీ నిరసనలతో తెలంగాణ రాజకీయం వేడెక్కింది.

# దమ్ముంటే ఫార్ములా ఈ-రేస్‌పై సభలో చర్చ పెట్టండి

**హైదరాబాద్ :** దమ్ముంటే ఫార్ములా - ఈ రేస్ అంశంపై శాసనసభలో చర్చ పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంలో మీ ప్రభుత్వం కొన్ని నెలలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మీద, ముఖ్యంగా నా మీద అనేక నిరాధార అరోపణలు చేస్తున్నది. ఇదే విషయం మీద ఈ వారం మీ ఆధ్వర్యంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో గంటన్నర సేపు చర్చ కూడా జరిగినట్టు వార్తా కథనాలు వచ్చాయి. ఇదే అంశం మీద కేసులు నమోదు చేస్తామని, గవర్నర్ ఆమోదం వచ్చిందని రకరకాల లీకులు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి మీడియాకు ఇస్తున్నారు. ఈ అంశం మీద నాలుగు గోడల మధ్య చర్చ కన్నా రాష్ట్ర శాసన సభలో నాలుగు కోట్ల మంది ప్రజల ముందు చర్చ జరిగితే నిజానిజాలు ఏమిటో అందరికీ తెలుస్తాయని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి జరగాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వం ఫార్ములా-ఈ రేస్ నిర్వాహకులతో ఒక ఒప్పందం చేసుకున్నది. 2023లో విజయవంతంగా రేస్ జరిగి అన్ని వర్గాల మన్ననలు అందుకున్నది. ఈ రేస్ వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ.700 కోట్ల రూపాయల లబ్ది చేకూరింది అని నీల్సన్ సంస్థ నివేదిక స్పష్టం చేసింది.



2024లో మరో దఫా రేస్ జరగవలసి ఉండగా మీ ప్రభుత్వం వచ్చిన వెంటనే దాన్ని ఏకపక్షంగా రద్దు చేయడం జరిగింది. అప్పటి నుండి రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఈ రేస్ గురించి అనేక అవాస్తవాలను మీడియా ద్వారా ప్రచారం చేసి, ఇందులో ఏదో జరిగింది అనే అపోహలు సృష్టించే ప్రయత్నం మీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నది అని కేటీఆర్ మండిపడ్డారు.

రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే రేస్ గురించి అనేక అవాస్తవాలను మీడియా ద్వారా ప్రచారం చేసి... ఏదో జరిగిందనే అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తోందన్నారు. ఫార్ములా ఈ-రేస్ పూర్తిగా పారదర్శకంగానే జరిగిందని తెలిపారు. ఈ విషయమై రాష్ట్ర ప్రజలకు నిజానిజాలు తెలుసుకునే హక్కు ఉందని, శాసనసభలో చర్చకు పెట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ అంశంపై సభలో చర్చ జరగాలని కోరుతూ తమ పార్టీ ఎమ్మెల్యేలు స్పీకర్‌కు లేఖ కూడా ఇచ్చారని సీఎంకు రాసిన లేఖలో కేటీఆర్ పేర్కొన్నారు. నిజానికి ఫార్ములా-ఈ రేస్ ఒప్పందం అంతా పారదర్శకంగా జరిగింది. రేస్ నిర్వాహకులకు చెల్లింపులు కూడా పారదర్శకంగానే జరిగాయి అని ఇదివరకే నేను వివరంగా చెప్పడం జరిగింది. అయినా మీ ప్రభుత్వం మాత్రం దుష్ప్రచారం మానడం లేదు. రాష్ట్ర ప్రజలకు నిజాలేమిటో తెలుసుకునే హక్కు ఉన్నది. కనుక మీరు శాసనసభలో ఈ అంశంపై చర్చ పెట్టాలని నేను డిమాండ్ చేస్తున్నాను. అన్ని విషయాలు సవివరంగా రాష్ట్ర ప్రజలకు శాసన సభ వేదికగా చెబుదాం. శాసన సభ సెషన్ జరుగుతున్నది కనుక మీకు అనుకూలమైన రోజే ఈ చర్చను పెట్టండి. మరోసారి చెబుతున్నాను. ఫార్ములా-ఈ అంశంలో ఎలాంటి అవకతవకలు కానీ, అవినీతి కానీ జరగలేదు. రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి చేసే ఈ రేస్‌ను కేవలం మీ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు బలి చేశారు. దీనిపైన శాసనసభలో సవివరమైన చర్చ జరిగితే నిజానిజాలేమిటో నిగ్గుతేలుతాయని కేటీఆర్ పేర్కొన్నారు.

# సంక్రాంతి నుంచి మరో రెండు హామీలు

-మొదటిపేజీ తరువాయి

ప్రక్షాళన, ఇందిరమ్మ గృహాలు, రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం, సింగరేణి కార్మికులకు బోనస్ ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో పథకాలకు శ్రీకారం చుట్టారు. సంక్రాంతికి తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా వినూత్న పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. అందులో ప్రధానంగా భూమి లేని పేదలకు ఆర్థిక చేయూత అందించేందుకు సీఎం రేవంత్ సర్కార్, దేశంలో ఎక్కడా లేని విధంగా సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. భూమి ఉంటే సాగుతో ఆదాయం అందుతుంది. అదే లేని వారి పరిస్థితి ఎట్లా అంటూ ఆలోచించిన ప్రభుత్వం, వారికి ఏడాదికి రూ. 12 వేలు అందించేందుకు సిద్ధమవుతోంది. డిసెంబర్ 28న ఈ పథకానికి తొలి ఆడగు పడనుంది. అలాగే ఏ పథకం వర్తించాలన్నా రేషన్ కార్డు అవసరం. అర్హత ఉండి రేషన్ కార్డు లేని ఎన్నో కుటుంబాలు ఉన్నాయి. ప్రభుత్వాలు మారినా ఇటువంటి వారికి మాత్రం రేషన్ కార్డు లేదన్నది వాస్తవం. అందుకే సంక్రాంతి పండుగ తర్వాత సుమారు 30 లక్షలకు పైగానే రేషన్ కార్డులను ప్రభుత్వం అందించనుంది. దీనితో ఎన్నో పేద కుటుంబాలకు మేలు జరగనుంది. ఇటీవల నిర్వహించిన కుటుంబ సర్వే ద్వారా, రేషన్ కార్డు లేకుండా ఇబ్బందులకు గురవుతున్న వారి పరిస్థితి ప్రభుత్వం దృష్టికి వచ్చింది. అందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అంతేకాదు సంక్రాంతి అంటేనే పాడిపంటల పండుగని కూడా చెబుతారు. అటువంటి పండుగకు రైతన్నలలో చిరునవ్వులు చిందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి, రైతు బంధు పథకాన్ని ప్రవేశపెట్టనున్నారు. ఏడాదిలో రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేసిన ప్రభుత్వం, రైతు బంధు కూడా విడుదల చేయడం రైతన్నలకు అసలు సంక్రాంతి అంటే ఇదే అనే తరహాలో పథకం వరంగా మారనుంది. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మాటలు కాదు పాలన చేతల్లో చూపిస్తామంటూ ప్రకటించారు. గత పాలకులు దోచుకున్నారు.. దాచుకున్నారు. కానీ ఇందిరమ్మ రాజ్యంలో వాటికి చోటు లేదు. ప్రజా సంక్షేమమే మా ధ్యేయమంటూ సీఎం చెప్పారు. సేమ్ టు సేమ్ అలాగే సీఎం రేవంత్ రెడ్డి, ప్రజా పాలనకు కట్టుబడి సంక్రాంతికి వరాల జల్లు కురిపిస్తుండడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సిరిసిల్ల కార్మికులకు పొంగల్ సందడి

**కరీంనగర్ :** వస్త్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి దొరికింది. సాంచల్ బంద్ అయి ఉపాధి కరువై ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్న నేతన్నకు తమిళనాడు బాసటగా నిలిచింది. పొంగల్ చీరల ఆర్డర్ ఇచ్చి నేతన్నకు చేతినిండా పని కల్పించింది. వస్త్ర పరిశ్రమ నిలయమైన సిరిసిల్ల సాంచల చప్పుడుతో సందడిగా మారింది. ఏడాది కాలం ఉపాది లేమితో సిరిసిల్ల నేత కార్మికులు కొట్టుమిట్టాడుతున్నారు. వారికి కాస్త ఊరటనిచ్చేలా తమిళనాడు ప్రభుత్వం భారీ ఆర్డర్ ఇచ్చింది. వచ్చే నెల జనవరి లో జరిగే పొంగల్ పండుగను తమిళ ప్రజలు వైభవంగా జరుపుకుంటారు. అక్కడి ప్రభుత్వం మహిళలకు పొంగల్ కానుకగా చీరలను అందజేయనుంది. అందుకు కావాల్సిన చీరల ఆర్డర్ ను తమిళ ప్రభుత్వం సిరిసిల్ల నేతన్నలకు ఇచ్చింది. దీంతో నేతన్నలకు చేతినిండా పని దొరికింది. తమిళనాడు చీరల ఆర్డర్ తో సిరిసిల్ల నేతన్నల ఇంటా ముందస్తు సంక్రాంతి శోభ సంతరించుకుంది. తమిళనాడు ప్రభుత్వం ప్రతి సంవత్సరం సంక్రాంతి (పొంగల్) పండుగకు పేదలకు చీరలను పంపిణీ చేస్తుంది. ఈసారి 3.12 కోట్ల చీరలు, పంచెల ఉత్పత్తికి రూ.485.25 కోట్లు కేటాయించింది. అందులో1.56 కోట్ల చీరలు ఉన్నాయి. ఇవి తమిళనాడు లోని తిరుపూర్,



కోయంబత్తూర్, సేలం, ఈరోడ్ ప్రాంతాల్లోని మరమగ్గాలకు ఆర్డర్లు ఇవ్వగా.. సమయం తక్కువగా ఉండడంతో పండుగకు సకాలంలో చీరలు కావాలని టెండర్ల ద్వారా సిరిసిల్ల కు ఆర్డర్లు ఇచ్చారు. 11 లక్షల మీటర్ల చీరల బట్ట ఉత్పత్తి అర్డర్లు (సుమారు 2 లక్షల చీరలు) రావడంతో నేత కార్మికులకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడు చీరలు ఉత్పత్తి చేయడం ద్వారా నెల రోజులపాటు కార్మికులకు ఉపాధి లభిస్తుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడు తరహాలో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని నేతన్నలను ఆదుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా కోటి 30 లక్షల చీరెలు ఆర్డర్లు ఇచ్చి ఆదుకోవాలని పాలిస్టర్ బట్ట తయారు చేస్తే కనీస గిట్టు బాటు కావడం లేదని ప్రభుత్వమే కార్మికులను ఆదుకోవాలని కోరుతున్నారు. తమిళనాడు ప్రభుత్వానికి అవసరమైన చీరల ఉత్పత్తితో సిరిసిల్లతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో చీరల సందడి నెలకొంది. సిరిసిల్లతోపాటు చంద్రంపేట, తంగళ్ళపల్లి, రాజీవ్ నగర్, గంగాధర మండలం గర్షకుర్తి ప్రాంతాల్లో తమిళనాడు చీరల ఉత్పత్తి చేస్తూ నేతన్నలు ఉపాధి పొందుతున్నారు. ఒక్క మీటరు బట్ట నేసి ఇస్తే రూ.6 ఇస్తున్నారు. అదే లేబర్ కు ప్రతీ మీటరుకు రూ.2.50 చెలిస్తారు. సాంచాలపై ఉత్పత్తి చేసిన బట్ట ఆధారంగా ఆసామికి, కార్మికుడికి కూలి లభిస్తుంది. సిరిసిల్లలో గతంలో తెల్లని పాలిస్టర్ బట్టను మాత్రమే ఉత్పత్తి చేసే నేత కార్మికులు పవర్ లూమ్స్ పై టెక్నాలజీ జోడించి వివిధ డిజైన్ లో బతుకమ్మ చీరలను ఉత్పత్తి చేసే స్థాయికి ఎదిగారు. మగ్గాలకు జకార్డ్, దాబీలను అమర్చుకొని కొంగు, చీరల బార్డర్, అంచుల్లో రకరకాల పలు రంగులను కలిపి అందమైన చీరలు నేశారు. దీంతో ఇప్పుడు సిరిసిల్ల వస్త్రానికి నవ్యత, నాణ్యత అదనపు ఆకర్షణగా నిలుస్తున్నాయి. త్వరలో మహిళా సంఘాల కు చీరలు పంపిణీ చేస్తామని తెలిపిన తెలంగాణ ప్రభుత్వం సిరిసిల్లలోనే ఆ చీరలను నేయించే సన్నాహాలు జరుగుతున్నాయి.

## ఆ పథకం తెచ్చి భూదందా చేశారు



-మొదటిపేజీ తరువాయి

చేయబోతున్నట్లు ఉపముఖ్యమంత్రి తెలిపారు. హైదారాబాద్ పరిధిలోనే ఇలాంటి భూములు సుమారు 15 వేల ఎకరాలు ఉంటాయని అంచనా వేస్తున్నామని, అంత కంటే ఎక్కువగానే ఉండే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. పార్ట్-బిలో భూమి అనుకున్న వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారని, ఆ తర్వాత వారు ఇంకొకరి పేరు మీద మ్యూటేషన్ చేశారని, ఇలా పెద్ద దందా జరిగిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ భూముల గురించి అడిగేవారు లేరని.. ఇనాం, ఎండోన్మెంట్, వక్ఫ్, అవెక్యు భూములన్నీ లూటీ చేశారని డిప్యూటీ సీఎం భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ భూముల యజమానులు దేశంలో లేరని, వారంతా పాకిస్థాన్ వెళ్లారని, ఎవ్వరూ అబ్జెక్షన్ చెప్పకపోవడంతో అధికారులు సైతం సహకరించారని భట్టి ఆరోపించారు. ధరణి వల్ల అక్రమంగా రిజిస్ట్రేషన్ అయిన భూమి ముగ్గురు, నలుగురు వ్యక్తుల మీద బదలాయింపు అయిందని ఆయన చెప్పారు. అదంతా ఇప్పుడు వాళ్ల హక్కు అయ్యిందని, ప్రభుత్వం ఎన్‌వోసీ ఇచ్చింది కాబట్టి భూమి వాళ్లదేనని చెప్పారు. ఫోరెన్సిక్ ఆడిట్‌లో అన్ని నిజాలూ నిగ్గు తేలుస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్కమార్క చెప్పారు.

## అసెంబ్లీ బయట డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు పెట్టాలి..

## హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్ :** గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీలోకి వచ్చే సభ్యులకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మామ చాటు అల్లుడిగా రూ. పదివేల కోట్లు దోచుకున్న దొంగ హరీష్ రావు అని.. ఆ అవినీతిని మేము నిరూపిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఈ వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. సభ్యులపై ఆరోపణలు చేయొద్దని శాసనసభా వ్యవహారాల మంత్రి



శ్రీధర్ బాబు రూలింగ్ బుక్ చూపించి చెప్పారని హరీశ్‌రావు గుర్తు చేశారు. సుద్దులు మాకు చెప్పడం కాదు వారి సహచర మంత్రికి కూడా చెప్పాలి.. వెంకట్ రెడ్డి కమీషన్ లిస్టు చదవమంటే నేను చదువుతాను అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కొంతమంది సభ్యులు డ్రింక్ చేసి సభకు వస్తున్నారని, సభలోకి వచ్చి ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదని అన్నారు. అసెంబ్లీ బయట డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు పెట్టాలని హరీష్ రావు సూచించారు

## ధరణి స్థానంలో భూభారతి



-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలోని 33 కలెక్టరేట్లలో ఒక రోజు చర్చ కూడా నిర్వహించాం. 18 రాష్ట్రాల్లో ఆర్ఓఆర్ చట్టాలను పరిశీలించి భూభారతి తీసుకొచ్చాం. ప్రతి గ్రామానికి ఓ రెవెన్యూ అధికారిని నియమిస్తాం. భూ వివాదాలపై అప్పీల్‌కు ట్రైబ్యునల్ ఏర్పాటు చేస్తాం. అనుభవదారుల కాలాన్ని కూడా ఈ కొత్త బిల్లులో పొందుపరిచాం. 33 మాడ్యూల్స్‌తో ఉన్నదాన్ని 6 మాడ్యూల్స్‌తో పునఃప్రక్షాళన చేస్తున్నాం అని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శాసనసభలో భూభారతి బిల్లును మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రవేశ పెట్టారు. రాష్ట్రంలో ఉన్న భూ సమస్యల పరిష్కృతం కోసం ఈ బిల్లును తీసుకువచ్చామని తెలిపారు. బిల్లును ప్రవేశపెడుతూ, ఈరోజు చరిత్రాత్మక, రాష్ట్ర ప్రగతికి బాటలు వేసే రోజన్నారు. భూమి పేదరికాన్ని దూరం చేసి ఆత్మగౌరవంతో జీవించేలా చేస్తుందని, గ్రామాల్లో భూమి ప్రధాన జీవనాధారం అని మంత్రి పేర్కొన్నారు. కష్టజీవులను కంటికి రెప్పలా చూసుకునే బాధ్యత ప్రభుత్వాలదని వివరించారు. 1971లో తెచ్చిన ఆర్‌వోఆర్ చట్టం 49 ఏళ్లపాటు మనుగడలో ఉందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే ప్రజలకు భద్రత, భరోసా అని అన్నారు. ఇందిరమ్మను ఇప్పటికీ ప్రజలు గుండెల్లో పెట్టుకుని చూస్తున్నారని తెలిపారు. గతంలో తెచ్చిన ధరణి పోర్టల్‌తో కొత్త సమస్యలు తలెత్తాయని ఆరోపించారు. "కొత్త చట్టంలో భూదార్ అంశాన్ని చేర్చాం. ప్రతి రైతుకు భూదార్ కోడ్ అంశంపై కొత్త చట్టంలో ఉంది. గతంలో ప్రతి గ్రామంలో జమాబందీ జరిగేది. గతంలో 23 వేల మంది వీఆర్‌వోలు ఉండేవారు. ఒక్క కలం పోటుతో వీఆర్‌వో వ్యవస్థను రూపుమాపారు. గత ప్రభుత్వ హయాంలో రెవెన్యూ వ్యవస్థను కుప్పకూల్చారు. ఏటా జమాబందీ చేపట్టే అంశాన్ని కొత్త చట్టంలో పొందుపరిచాం. ల్యాండ్ ట్రైబ్యునల్ పునర్నిర్మాణంపై కొత్త చట్టంలో ఉంది. సీసీఎల్‌ఏ ద్వారా ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై చట్టంలో ఉంది." – పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి

**నాడు అన్న మాటలను నిజం చేస్తూ**

రాష్ట్ర ప్రజలకు ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో వేస్తామని హామీ ఇచ్చామని అనుకున్నట్లుగానే చేస్తున్నామని మంత్రి పొంగులేటి అన్నారు. ముసాయిదా బిల్లును 40రోజులు వెబ్‌సైట్‌లో ఉంచామని తెలిపారు. ఎమ్మెల్యేలు, మేధావులు ఇచ్చిన అంశాలను డ్రాఫ్ట్‌లో పెట్టామన్నా ఆయన 33 కలెక్టరేట్లలో ఒకరోజు చర్చ కూడా పెట్టారాని వివరించారు. 18 రాష్ట్రాల్లో ఆర్ఓఆర్ చట్టాలు పరిశీలించి భూభారతి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. గతంలో అర్ధరాత్రి ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చారని ఆ పోర్టల్ కారణంగా 4 నెలలు రిజిస్ట్రేషన్లు జరగలేదని గుర్తుచేశారు. బేషజాలకు పోయి ధరణిని మార్చడం లేదని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ధరణి పోర్టల్ రద్దు చేస్తున్నామని దాన్ని బంగాళాఖాతంలో వేస్తామంటే ప్రజలు కాంగ్రెస్‌ను ఆశీర్వదించారని చెప్పారు.

**భూ భారతిలో ఆరు మాడ్యూల్స్**

గతంలో ధరణిలో 33 మాడ్యూల్స్ ఉండేవి. భూభారతిని ఆరు మాడ్యూల్స్‌తో ప్రక్షాళన చేస్తున్నాం. ధరణి పోర్టల్‌లో ఆస్తుల వివరాలు చూసుకునే పరిస్థితి లేదు. కొల్లగొట్టిన భూములను సీక్రెట్ లాకర్ ధరణిలో పొందుపర్చారు. కొత్త చట్టంలో ప్రతి భూమి వివరాలు పొందుపరుస్తాం. ప్రభుత్వ భూముల కబ్జాపై భూభారతి ద్వారా ఫిర్యాదు చేసే అవకాశముందని మంత్రి అన్నారు.

# పార్లమెంట్ ఆవరణలో ఇండియా బ్లాక్ నిరసన



న్యూఢిల్లీ : కేంద్ర హోం మంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలంటూ ప్రతిపక్ష కూటమి ఇండియా బ్లాక్ బుధవారం పార్లమెంట్ ఆవరణలో నిరసన చేపట్టింది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక సహా పలువురు ఎంపిలు ఈ నిరసనలో పాల్గొన్నారు. అంబేద్కర్ చిత్రపటాలతో చేబూని, జై భీమ్, అమిత్‌షా క్షమాపణలు చెప్పాల్సిందే అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్, వామపక్షాలతో పాటు ఆర్‌జెడి, డిఎంకె, ఆప్ పార్టీలు ఆందోళన చేపట్టాయి. మనుస్మృతిని విశ్వసించే వారు అంబేద్కర్‌తో విభేదిస్తారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కూడా అమిత్‌షాపై విరుచుకుపడ్డారు. హోం మంత్రి బాబాసాహెబ్‌ను అవమానించడం ద్వారా బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ పతాకానికి వ్యతిరేకమని, వారి పూర్వీకులు ఆశోక చక్రాన్ని వ్యతిరేకించారని మరోసారి రుజువైంది. భారత రాజ్యాంగానికి బదులు మనుస్మృతిని తొలిరోజు నుండే అమలు చేయాలని సంఘ్‌పరివార్ భావిస్తోందని అన్నారు.

"నాలాంటి కోట్లాది మంది ప్రజలకు అంబేద్కర్ భగవంతుడి కంటే తక్కువేమీ కాదు. దళితులు, గిరిజనులు, మైనారిటీలు, వెనుకబడిన తరగతులు , పేదలకు ఆయన ఎప్పటికీ గొప్పవాడేనని బిజెపి నేతలు అర్థం చేసుకోవాలి" ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు.




# మాస్కోలో పేలుడు

## రష్యా ఉన్నత స్థాయి సైనిక జనరల్ సహా ఇద్దరు మృతి

మాస్కో : రష్యా రాజధాని మాస్కోలో మంగళవారం జరిగిన బాంబు దాడిలో అత్యంత సీనియర్ మిలటరీ నేత, రష్యా ఆర్మీకి చెందిన రసాయన ఆయుధాల విభాగాధిపతి ఇగర్ కిరిలొవ్ మరణించారు. ఈ బాంబు దాడి జరిపింది తామేనని ఉక్రెయిన్ ప్రకటించింది. ఆగేయ మాస్కోలో ఒక అపార్ట్‌మెంట్ భవనం వెలుపల నిలిపి వుంచిన స్కూటర్‌లో పేలుడు పదార్థం పెట్టారు. దాన్ని పేల్చివేయడంతో ఇగర్ కిరిలొవ్ ఆయన అసిస్టెంట్ చనిపోయారని అధికారులు తెలిపారు. ఉక్రెయిన్‌లో రష్యా బలగాలు విజయం సాధించాయని అధ్యక్షుడు పుతిన్ చెప్పుకున్న మరుసటి రోజే రాజధానిలోని నివాస ప్రాంతంలో ఈ దాడి జరగడం గమనార్హం. రష్యా సైన్యంలో రసాయన, జీవ, రేడియోలాజికల్ ఆయుధాల విభాగానికి కిరిలొవ్ (54) నేతృత్వం వహిస్తున్నారు. కిరిలొవ్‌ను యుద్ధ నేరస్తుడిగా ప్రకటిస్తూ స్పెషల్ ఆపరేషన్‌లో భాగంగానే ఈ పేలుడు జరిపినట్లు ఉక్రెయిన్‌కి చెందిన ఎస్‌బియు సెక్యూరిటీ సర్వీస్ వర్గాలు తెలిపాయి. పేలుడు ధాటికి ఆ భవనంలోని పలు కిటికీల అద్దాలు పగిలిపోయాయి. ముందు తలుపు దారుణంగా దెబ్బతింది. ఈ దాడిని తీవ్రవాద చర్యగా రష్యా అధికారులు పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. యుద్ధ రంగంలో నిషేధించిన రసాయన ఆయుధాలను ఉక్రెయిన్‌పై వినియోగించారని, ఆ రకంగా కిరిలొవ్ యుద్ధ నేరస్తుడని ఉక్రెయిన్ చెబుతోంది. యుద్ధ నేరాలకు ప్రతీకారం తప్పదని ఆ వర్గాలు హెచ్చరించాయి.

# కనీస మద్దతు ధరకు చట్టబద్ధత

న్యూఢిల్లీ : పంటలకు అందిస్తున్న కనీస మద్దతు ధరలకు (ఎంఎస్‌పి) చట్టబద్ధత కల్పించి అమలు చేయాలని వ్యవసాయం, పశుసంవర్ధకం, ఫుడ్ ప్రాసెసింగ్‌పై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని అన్నదాతలు, పలు రైతు సంఘాలు చాలా కాలం నుంచి డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఎంఎస్‌పిలకు చట్టబద్ధత కోరుతూ శంభు, ఖనౌరీ సరిహద్దుల వద్ద రైతులు ఆందోళన నిర్వహిస్తున్న సమయంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఈ సిఫారసు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి, జలంధర్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చెన్నీ నేతృత్వంలోని కమిటీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయం, రైతుల సంక్షేమానికి సంబంధించిన గ్రాంట్ల డిమాండ్లపై లోక్‌సభకు తన తొలి నివేదికను అందజేసింది. ఎంఎస్‌పిలకు చట్టబద్ధత కల్పించాలన్న సిఫార్సును తన నివేదికలో కమిటీ చేర్చిందని లోక్‌సభ సచివాలయం ఓ ప్రకటనలో తెలిపింది. 'దేశంలో వ్యవసాయ సంస్కరణలు, రైతుల సంక్షేమం కేంద్రంగా జరుగుతున్న చర్చలో ఎంఎస్‌పీల అమలు కేంద్ర బిందువుగా ఉన్నదని కమిటీ అభిప్రాయపడింది. ఎంఎస్‌పిలకు చట్టబద్ధత కల్పిస్తే దేశంలో రైతుల ఆత్మహత్యలను తగ్గించవచ్చునని పేర్కొంది. రైతులకు ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించడం, మార్కెట్‌లో నెలకొంటున్న అస్థిర పరిస్థితుల నుండి వారికి రక్షణ కల్పించడం, రుణ భారాన్ని తగ్గించడం ద్వారా ఆత్మహత్యల నుండి రైతులను కాపాడవచ్చు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని ఎంఎస్‌పిలకు చట్టబద్ధత కల్పించాలని కమిటీ సిఫారసు చేసింది' అని లోక్‌సభ సచివాలయం ఆ ప్రకటనలో వివరించింది.

# రిక్రూట్‌మెంట్ పరీక్షలు ఇక ఎన్‌టిఎ నిర్వహించదు



న్యూఢిల్లీ : కొత్త సంవత్సరం నుండి ఇక ఎటువంటి రిక్రూట్‌మెంట్ పరీక్షలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) నిర్వహించబోదని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉన్నత విద్యకు సంబంధించిన ప్రవేశ పరీక్షలపై మాత్రమే దృష్టి కేంద్రీకరిస్తుందని స్పష్టం చేశారు. మెడికల్ ఎంట్రెన్స్ నీట్ పరీక్షా పత్రం లీక్, అలాగే మరి కొన్ని ప్రశ్నాపత్రాల లీక్‌లతో పలు పరీక్షలు రద్దయిన వైనం పెద్దయెత్తున విమర్శలకు దారి తీసింది. దీంతో ఈ ఏడాది ప్రారంభంలో ఏర్పాటుచేసిన ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సుల మేరకు పరీక్షల సంస్కరణలు తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. సాంప్రదాయపద్ధతిలో పెన్ను, పేపర్‌తో నిర్వహించాలా? లేక కంప్యూటర్‌తో పరీక్ష నిర్వహించాలా? అనే విషయమై ఆరోగ్య మంత్రిత్వశాఖతో విద్యా శాఖ చర్చలు జరుపుతోంది. కామన్ యూనివర్శిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సియుఇటి) %-% యుజి ని ఏడాదికి ఒకసారి మాత్రమే నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు. సమీప భవిష్యత్తులో కంప్యూటర్ సహాయంతో, సాంకేతిక ఆధారిత ప్రవేశపరీక్షలకు మారాలని ప్రభుత్వం యోచిస్తోందని చెప్పారు. కొత్త సంవత్సరంలో ఎన్‌టిఎను పునర్వ్యవస్థీకరించనున్నట్లు మంత్రి తెలిపారు. కనీసం పది కొత్త పదవులను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఇంకా పనితీరులో కూడా చాలా మార్పులు వస్తాయన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేని రీతిలో పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు.

# జార్జియా రెస్టారెంట్‌లో 12 మంది భారతీయులు మృతి

గుడౌరి : జార్జియాలోని గుడౌరిలో ఒక రెస్టారెంట్‌లో 12 మంది భారతీయుల మృతదేహాలను కనుగొన్నారు. ఈ విషయాన్ని ఆ దేశంలోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. మృతదేహాలపై లాంటి గాయాలు లేదా హింస జరిగిన ఆనవాళ్లు గుర్తించలేదని తెలిపింది. వీరంతా కార్బన్ మోనాక్సైడ్ పీల్చిన కారణంగా మరణించారని ప్రాథమిక విచారణలో తేలిందని తెలిపింది. రెస్టారెంట్‌లోని రెండో అంతస్తులో ఉన్న బెడ్‌రూమ్‌ల్లో మృతదేహాలు ఉన్నాయని వెల్లడించింది. రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయిన తరువాత బెడ్‌రూమ్‌లకు సమీపంలో ఉన్న పవర్ జెనరేటర్‌ను ఆన్ చేసినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు తెలిపింది. ఈ ప్రమాదంపై స్థానిక పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారని తెలిపింది. మృతి చెందిన 12 మంది భారతీయులేనని భారత రాయబార కార్యాలయం చెబుతుండగా, జార్జియా ప్రభుత్వం మాత్రం 11 మంది భారతీయులు, మరొకరు తమ దేశస్థుడని తెలిపింది. జార్జియాలోని గుడౌరి మంచు పర్వత క్రీడలకు ప్రసిద్ధి. వీటిని చూసేందుకు భారతీయులు ఎక్కువమంది అక్కడ పర్యటిస్తారు. అక్కడి రెస్టారెంట్లలోనూ భారతీయులు పని చేస్తుంటారు.

# అమెరికాలో మళ్లీ కాల్పుల మోత

అగ్రరాజ్యం అమెరికాలోని మళ్లీ కాల్పుల మోత మోగింది. విస్కాన్సిన్‌లోని మాడిసన్‌లో ఉన్న అబండంట్ క్రైస్తవ పాఠశాలలో కాల్పులు జరిగాయి. 12వ తరగతి విద్యార్థి ఈ ఘటనకు కారణమైనట్లు పోలీసులు గుర్తించారు. ఈ కాల్పుల్లో ఐదుగురు చనిపోయారు. మరో ఐదుగురు గాయపడ్డారు. వారందరినీ స్థానిక ఆసుపత్రులకు తరలించారు. నిందితుడు సైతం మఅతుల్లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతి చెందినవారు విద్యార్థులా లేదా సిబ్బందా అనే విషయం తెలియాల్సి ఉంది. కాల్పులు ఘటనకు సంబంధించి దేశాధ్యక్షుడు బైడెన్‌కు అధికారులు సమాచారం అందించారు. 400 విద్యార్థులు చదువుతున్న పాఠశాలలో కాల్పుల ఘటనతో ఒక్కసారిగా భయాందోళనలు చోటుచేసుకున్నాయి. భారీ ఎత్తున పోలీసులు వాహనాలు, అంబులెన్స్‌లు, ఫైరింజన్లు పాఠశాలను మోహరించాయి. ఘటనపై మాడిసన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తాజా ఘటనతో అగ్రరాజ్యంలో తుపాకీ నియంత్రణ, పాఠశాలల భద్రత యూఎస్‌లో ప్రధాన రాజకీయ, సామాజిక సమస్యగా మారింది. ఇటీవల కాలంలో అమెరికాలోని పాఠశాలల్లో కాల్పులు ఘటనలు పెరుగుతున్నాయి. ఈ ఏడాదిలో మొత్తం 322 కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నట్లు ఓ నివేదిక తెలిపింది.

# న్యూయార్క్ కోర్టులో ట్రంప్‌నకు ఎదురు దెబ్బ



న్యూయార్క్ : తనపై నమోదైన హుష్ మనీ కేసును కొట్టివేయాల్సిందిగా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ చేసిన విజ్ఞప్తిని మన్‌హటన్ న్యాయమూర్తి జువాన్ మర్చన్ తిరస్కరించారు. అధ్యక్షుడికి రక్షణ కల్పిస్తూ జులైలో అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన రూలింగ్‌ను దృష్టిలో పెట్టుకుని తనపై అభియోగాలను కొట్టేయాలని ట్రంప్ కోరారు. అధికారిక చర్యలకు సంబంధించే ఈ రక్షణ వుంటుంది తప్ప అనధికార వ్యవహార శైలికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి రక్షణ వుండదని న్యాయమూర్తి స్పష్టం చేశారు. పోర్న్ స్టార్‌కు డబ్బులు ఇవ్వడం(దీనినే హుష్ మనీ) కేసులో ట్రంప్ దోషి అని ఇప్పటికే కోర్టు తేల్చింది. ఆయనకు విధించాల్సిన శిక్షను ఖరారు చేయాల్సి వుంది. ఒకవేళ ఇదే గనుక జరిగితే శిక్ష అభియోగాలను ఎదుర్కొంటూ అధ్యక్షుడిగా శ్వేత సౌధంలో అడుగుపెట్టే తొలి అధ్యక్షుడు ట్రంప్ కానున్నారు. ఇదిలావుండగా, న్యాయమూర్తి మర్చన్ నిర్ణయాన్ని ట్రంప్ కమ్యూనికేషన్ డైరెక్టర్ స్టీవెన్ చెంగ్ విమర్శించారు. ఇది సుప్రీంకోర్టు నిర్ణయాన్ని ఉల్లంఘించడమే కాగలదని తప్పుబట్టారు. ఈ కేసును తక్షణమే కొట్టేయాల్సి వుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# దక్షిణ కొరియా అధ్యక్షుడికి రెండోసారి సమన్లు



సియోల్ : ఈ నెల ఆరంభంలో దేశంలో సైనిక పాలన విధించడంపై జరుగుతున్న విచారణలో సాక్ష్యమిచ్చేందుకు రావాల్సిందిగా దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు ఆ దేశ ప్రాసిక్యూషన్ సర్వీస్ రెండోసారి సమన్లు జారీ చేసింది. ఈనెల 21లోగా హాజరు కాని పక్షంలో అరెస్టు వారెంటు జారీ చేసే అంశాన్ని పరిశీలించాల్సి ఉంటుందని హెచ్చరించింది. డిసెంబరు 3న చోటు చేసుకున్న సంఘటనలపై ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ జరుపుతోంది. ఈ బృందం సోమవారం అధ్యక్షుడికి సమన్లు జారీ చేసింది. గత ఆదివారం అధ్యక్షుడిని విచారించాల్సి వుంది, కానీ ఆయన హాజరు కాకపోవడంతో రెండోసారి సమన్లు పంపింది. యూన్ ఈ విచారణకు హాజరైనట్లైతే, అధికారంలో వుంటుండగా దర్యాప్తునకు సిద్ధమైన మొదటి దక్షిణ కొరియా అధ్యక్షుడవుతారు. ఒకవేళ అరెస్టు వారెంటు జారీ చేయాలని ప్రాసిక్యూషన్ నిర్ణయిస్తే, అరెస్టు కాబోయే ఆసియా దేశపు మొదటి సిట్టింగ్ అధ్యక్షుడవుతారు. యూన్‌ను శనివారం పార్లమెంట్ అభిశంసించింది. పాలక కన్జర్వేటివ్ పీపుల్ పవర్ పార్టీ (పిపిపి)కి చెందిన 12మంది డిప్యూటీలు అనుకూలంగా ఓటు వేశారు. ప్రధాని హన్ డక్ సూ ప్రస్తుతం తాత్కాలిక అధ్యక్షుడిగా వున్నారు. రాజ్యాంగ కోర్టు నిర్ణయంపైనే ఆయన భవితవ్యం ఆధారపడి వుంది. దేశంలో మార్షల్ లా విధించడం ద్వారా అధ్యక్షుడు రాజ్యాంగాన్ని ఉల్లంఘించారా? లేదా? అని నిర్ణయించడానికి కోర్టుకు ఆరు మాసాల గడువు వుంది.

## 6 శాతం కేసుల్లోనే ఛార్జిషీట్

## నత్తనడకన మణిపూర్ హింసాకాండ కేసుల విచారణ

న్యూఢిల్లీ : మణిపూర్ హింసాకాండకు సంబంధించిన కేసుల విచారణ నత్తనడకన సాగుతోంది. ఈ కేసుల దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు నియమించిన 42 ప్రత్యేక విచారణ బృందాలు (సిట్) కేవలం 6 శాతం కేసుల్లోనే ఛార్జిషీట్ దాఖలు చేశాయి. హత్య, అత్యాచారం, మహిళలపై లైంగిక నేరాలు, దగ్ధం, దోపిడీ, ఇతర హేయమైన చర్యలతో మొత్తం 3,023 కేసులు నమోదు కాగా, వీటిలో 192 కేసుల్లోనే ఇప్పటి వరకూ ఛార్జిషీట్లు దాఖలు కావడం ఆందోళన కలిగిస్తోంది. కేసుల విచారణ ప్రారంభమైందా? లేదా? అనే విషయం కూడా స్పష్టంగా తెలియడం లేదు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఇద్దరు కుకీ జో మహిళలపై లైంగిక వేధింపులు, నగంగా ఊరేగించిన కేసు విచారణ ఇంకా ప్రారంభం కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. 2023 మే 4న ఈ ఘటన జరిగితే వీడియో వైరల్‌గా మారిన రెండు నెలల తరువాత రాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేశారు. తరువాత సిబిఐకి అప్పగించారు. ఈ కేసులో ఒక బాలుడుసహా ఆరుగురు నిందితులపై ఛార్జిషీట్ నమోదు చేసి గౌహతిలోని కోర్టులో గత ఏడాది జులైలో సిబిఐ దాఖలు చేసింది. అయినా ఇంకా విచారణ ప్రారంభం కాలేదు. గత ఏడాది ఆగస్టులో దేశవ్యాప్తంగా ఉన్న పోలీసు అధికారులను రప్పించి ఈ సిట్లను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది నవంబర్ 20 వరకూ 574 నిందితులపై ఛార్జిషీటు దాఖలు చేశాయి. 384 మందిని అరెస్టు చేశాయి. భద్రతా దళాల నుంచి దోచుకున్న 501 ఆయుధాలను, 13,464 మందుగుండు సామాగ్రిని సిట్‌లు స్వాధీనం చేసుకున్నాయి. ఈ సిట్లను సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఆరు గ్రూపులుగా విభజించారు. హత్యలు, తీవ్రమైన నేరాల కేసుల విచారణకు సంబంధించి ఒక గ్రూపును, మహిళలపై అత్యాచారాలు, వేధింపుల కేసుల విచారణకు ఒక గ్రూపును ఏర్పాటు చేశారు. ఆస్తుల దగ్ధం, లూటీలు, ఇతర నేరాలకు మరో నాలుగు గ్రూపులను ఏర్పాటు చేశారు.

# సలహాలు ఇస్తారు.. బాధ్యతలు విస్మరిస్తారు..!



న్యూఢిల్లీ: అందరికీ సలహాలిచ్చే ప్రధాని నరేంద్ర మోడీ తన బాధ్యతలను మాత్రం విస్మరిస్తున్నారని సిపిఎం రాజ్యసభ ఎంపి జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. రాజ్యాంగంపై రాజ్యసభలో మంగళవారం కూడా కొనసాగిన ప్రత్యేక చర్చలో ఆయన మాట్లాడారు. అల్లర్లతో అట్టుడుకుతున్న మణిపూర్‌ను ఏడాదిన్నరగా సందర్శించేందుకు ప్రధాని ఇప్పటికీ సిద్ధపడం లేదని పేర్కొన్నారు. రాజ్యాంగంపై చర్చ వినడానికి కూడా ఆయన ఇష్టపడడం లేదు. అందుకే పార్లమెంటుకు ముఖం చాటేస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, ఫెడరలిజం భారత రాజ్యాంగానికి మూలస్తంభాలని, బిజెపి అప్రజాస్వామికంగా ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందని అన్నారు. మొత్తం 830 మంది ప్రజాప్రతినిధులు బిజెపిలోకి ఫిరాయించారన్నారు. దాంతో వారంతా 'పవిత్రులు' అయ్యారా అని ఎద్దేవా చేశారు. 95 ఏళ్ల విదేశీయుడు జార్జి సోరోస్‌పై బిజెపి వారం రోజులపాటు పార్లమెంట్‌ను అడ్డుకుందని, అయితే సోరోస్ డబ్బు ఎవరికి వస్తుంది? జెపిసి విచారణ జరిపితే ప్రధాని కార్యాలయం గుమ్మం వరకు చేరుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. సోరోస్ సంస్థకు భారతదేశం నుండి డబ్బు వెళ్తోందని, దీన్ని బిజెపి ఆపగలదా? ఆపే ఆలోచన బిజెపికి ఉందా? అని సూటిగా ప్రశ్నించారు. ఫెడరలిజాన్ని దెబ్బతీసే విధంగా బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు గవర్నర్‌గిరీని దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి గవర్నర్లు ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' అనేది 'ఒకే దేశం, ఒకే నాయకుడు, ఒకే ఆలోచన'కు పొడిగింపు అని విమర్శించారు. దేశంలో అప్రకటిత అత్యవసర పరిస్థితి ఉందని జాన్ బ్రిట్టాస్ ఎత్తిచూపారు.

# జమ్మూ కాశ్మీర్‌లో అగ్ని ప్రమాదం


కథువా: జమ్మూ కాశ్మీర్‌లోని కథువాలో బుధవారం తెల్లవారుజామున ఓ ఇంట్లో మంటలు చెలరేగడంతో ఇద్దరు చిన్నారులు సహా ఆరుగురు వ్యక్తులు ఊపిరాడక మరణించారని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో నలుగురు వ్యక్తులు ఆసుపత్రి పాలయ్యారని వారు తెలిపారు. జిల్లాలోని శివ నగర్ ప్రాంతంలోని ఓ ఇంట్లో ఉన్నవారు నిద్రిస్తున్న సమయంలో దట్టమైన పొగలు వ్యాపించాయి. తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో స్థానికులు మంటలను గమనించి ఇంటికి చేరుకున్నారని అధికారులు తెలిపారు. బాధితులను కతువాలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించగా, ఇద్దరు మైనర్‌లతో సహా ఆరుగురు మరణించినట్లు ప్రకటించారు. "పది మందిని ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆరుగురు చనిపోయారు, మరో నలుగురు గాయపడ్డారు" అని ఆసుపత్రిలోని సీనియర్ డాక్టర్ చెప్పారు. పొగ పీల్చడంతో ఊపిరాడక బాధితులు చనిపోయారని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని, కాలిన గాయాలు ఏవీ నివేదించలేదని డాక్టర్ తెలిపారు.

# సబ్జాతో డయాబెటిస్ మాయం!




ప్రపంచవ్యాప్తంగా డయాబెటిస్ భారిన పడిన వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. చిన్న పెద్ద అని తేడ లేకుండా ఈ డయాబెటిస్ అందరికి వచ్చేస్తుంది. డయాబెటిస్ వచ్చిన వారు ఆ వ్యాధి వల్ల చనిపోయే ప్రమాదం తక్కువ ఉన్నప్పటికీ గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంది. అయితే డయాబెటిస్ ని మాయం అవ్వాలంటే ఈ చిట్కాలు పాటించండి. డయాబెటిస్ ఉన్నవారు ఎక్కువ అన్నం ఎక్కువగా తినకూడదు.. కూరగాయలను ఎక్కువగా తీసుకోవాలి.. పండ్లు ఎక్కువగా తీసుకోవాలి.. ఇలా అన్ని రకాల సహజ కూరగాయలను ఎక్కువగా తీసుకుంటే ఆరోగ్యకరంగా ఉంటారు. అయితే సబ్జా విత్తనాలు తీసుకోవటం వల్ల ఎన్నో ఆరోగ్యకరమైన లాభాలు ఉన్నాయి. సబ్జా విత్తనాల్లో విలువైన పోషకాలు ఉంటాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఈ పోషకాలు రెట్టింపు మేలు చేస్తాయి. గ్లూకోజ్, ఇన్సులిన్ టాలరెన్స్‌ను పెంచుతాయి. సబ్జాతో ఉన్న ఉపయోగాలు ఏంటంటే.. శరీరంలో తలెత్తే పలు రకాల ఇన్‌ఫ్లమేషన్లను ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్‌తో అదుపు చేయవచ్చు. ఈ పోషకం సబ్జాలో ఉంటుంది. వంద గ్రాములు సబ్జా విత్తనాల్లో 17.8 గ్రాముల ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. అంతేకాదు సబ్జా విత్తనాల్లో అధికంగా ఉండే పీచు కూడా ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తుంది. ఈ విత్తనాల్లో ఉండే యాంటీఆక్సిడెంట్లు సంపూర్ణ ఆరోగ్యానికి తోడ్పడతాయి. రక్తపోటు కలిగి ఉన్న డయాబెటిస్ వారు ప్రతి రోజూ క్రమం తప్పకుండా సబ్జా విత్తనాలు తింటే వారి సిస్టాలిక్ బ్లడ్ ప్రెషర్ తగ్గినట్టు పలు పరిశోధనల్లో తేలింది. రక్తపోటు తగ్గితే గుండె మీద పడే భారం కూడా తగ్గుతుంది. కాబట్టి సబ్జా విత్తనాలు తీసుకోవడం ద్వారా గుండె జబ్బులను అరికట్టవచ్చు. రోజంతా తరచుగా నీళ్లు తాగుతూ ఉండాలి. ఇలా చెయ్యడం వల్ల డయాబెటిస్ పూర్తిగా మాయం అవ్వకపోయిన తగ్గుతుంది అని పరిశోధకులు చెప్తున్నారు.

# గుడ్లు తింటే బరువు తగ్గుతారా?



ఉడికించిన కోడిగుడ్లు రోజువారీ ఆహారంలో క్రమం తప్పకుండా రెండు తీసుకుంటే బరువు తగ్గవచ్చు అని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.ఒక క్రమ పద్ధతిలో ఉడికించిన కోడిగుడ్డు ను రోజు వారి ఆహారంలో తీసుకోవడం వల్ల రెండు వారాలకు 24 పౌండ్ల బరువును తగ్గించుకోవచ్చు. మన దేశంలో ఇప్పుడున్న ఆరోగ్య సమస్య ఊబకాయం. ఊబకాయం వల్ల హృదయ సంబంధ వ్యాధులు, మధుమేహం మరియు అనేక రకాల క్యాన్సర్ వంటి వ్యాధుల వచ్చే అవకాశం ఉంటుంది. చాలా మంది బరువు తగ్గడానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తారు. క్యాలరీలను తగ్గించకుండా బరువు తగ్గడం అనేది దాదాపు అసాధ్యం. బరువును అదుపులో ఉంచడం కోసం చేసే ఆహార నియంత్రణ లో ముఖ్యమైనది శరీరానికి అవసరమైన పోషకాలను మాత్రమే అందించాలి.ఆరోగ్యకరమైన ఆహారం అంటే మీరు తాజా కూరగాయలు మరియు పండ్లు, ధాన్యాలు మరియు బీన్స్ తినాలి, కానీ కేలరీల తగ్గించడానికి, అధిక కేలరీల డెజర్ట్‌లు, ఫాస్ట్ ఫుడ్, ఫిజీ డ్రింక్స్ మరియు స్వీట్స్ తగ్గించండి. మన శరీరానికి శక్తి కోసం చాలా కేలరీలు అవసరమని మనందరికీ తెలుసు.కొంతకాలం పోషకాలను తీసుకోవడం తగ్గిస్తే, మన శరీరానికి హాని కలిగించవచ్చు, జీవక్రియను బలహీనపరుస్తుంది మరియు తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు ప్రమాదాన్ని పెంచుతుంది. గుడ్లు ప్రోటీన్ మరియు అనేక పోషకాలను కలిగి ఉన్నందున ఆరోగ్యకరమైన ఆహారం. గుడ్లు మన శరీరానికి అవసరమైన విటమిన్లు మరియు పోషకాలను అందిస్తాయి. గుడ్డు లో విటమిన్ బి 5 మరియు విటమిన్ బి 12 పుష్కలంగా ఉన్నాయి. ఇందులో ఫోలేట్, విటమిన్ ఇ, పొటాషియం, కాల్షియం, మాంగనీస్, జింక్ మరియు ఐరన్ వంటి ఖనిజాలు మరియు విటమిన్లు కూడా ఉన్నాయి. ఒక పెద్ద గుడ్డులో చిన్న మొత్తంలో కార్బోహైడ్రేట్లు, ఐదు గ్రాముల కొవ్వు, ఆరు గ్రాముల నాణ్యమైన ప్రోటీన్ మరియు 77 కేలరీలు ఉంటాయి.ఆరోగ్యాన్నిచ్చే పోషకాలన్నీ పచ్చసొనలో ఉంటాయి,తెల్ల సొన లో ప్రోటీన్ మాత్రమే దొరుకుతుంది.

# రోగనిరోధక శక్తి పెంచుకోండిలా..



కీలక సూచనలు చేసిన ఆయుష్ శాఖ...! ప్రపంచంలోని దేశాలను కరోనా కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న విషయం తెలిసిందే. భారత్ లోను కరోనా తీవ్ర ప్రభావం చూపుతోంది. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి కరోనా సోకుతూ ఉండటంతో ఆయుష్ శాఖ రోగ నిరోధక శక్తి పెంచుకోవడానికి కీలక సూచనలు చేసింది. ఆయుష్ శాఖ ఎప్పుడు దాహం వేసినా వేడి నీటినే తాగాలని సూచించింది. ప్రతిరోజూ కనీసం అరగంట పాటు యోగా, ప్రాణాయామం, ధ్యానం చేయాలని చెప్పింది. వెల్లుల్లి, ధనియాలు, జీలకర్ర, పసుపు వంటకాల్లో తప్పక ఉండేలా చూసుకోవాలని సూచించింది. ఎండు ద్రాక్ష, శొంఠి, మిరియాలు, తులసితో చేసిన ఆయుర్వేద తేనీరును తాగాలని పేర్కొంది. రోజుకు ఒకటి లేదా రెండుసార్లు పాలలో కలుపుకుని తాగాలని తెలిపింది. ఉదయం, సాయంత్రం కొబ్బరి నూనెను ముక్కు రంధ్రాల దగ్గర పట్టిస్తే మంచిదని పేర్కొంది. రోజుకు రెండు నిమిషాల పాటు కొబ్బరి నూనెను పుక్కిలించి ఉమ్మివేయాలని.. గోరువెచ్చని నీటితో నాలుకను శుభ్రం చేసుకోవాలని పేర్కొంది. సోంపు గింజలు లేదా పుదీనా ఆకుల నీటి ఆవిరిని పొడిదగ్గు ఉన్నవారు రోజుకు ఒకసారి పీల్చుకోవాలని సూచించింది. బెల్లంతో లేదా తేనెతో లవంగాల పొడిని కలుపుకుని తాగితే మంచిదని తెలిపింది. దగ్గు ఎక్కువగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించింది.

# సెల్ఫీ లేకుండా ఉండలేకున్నారా..

## ఇక జాగ్రత్త పడాల్సిందే..



ఎవరైనా ఉదయం లేవగానే రామా కృష్ణ అంటారు.. ఈ మధ్య కాలంలో ఉదయం లేవగానే సెల్ఫీలే.. ఉదయం లేవగానే ఇప్పుడు ఎక్కువ మంది చేసే పని సెల్ఫీ తీసుకోవడం.. చేసిన ప్రతి చిన్న పనికి క్లిక్ అనిపించడం ఇప్పటి రోజుల్లో కామన్ అయింది. అయితే ఇలా సెల్ఫీలు తీసుకోవడం వల్ల కూడా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు చెప్తున్నారు.ఫోన్ ద్వారా రేడియేషన్ అనేది ముఖం మీద పడటం వల్ల చర్మ సంబంధిత సమస్యలు ఎక్కువగా వస్తున్నాయట.మితిమీరిన ఫోన్ వాడకం మానసిక్థితిపైనా ప్రభావం చూపుతోందని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. ఆత్మవిశ్వాసం మందగించడానికి, ఆందోళన పెరగడానికి సెల్ఫీలు కారణమవుతున్నాయని ఈస్థటిక్ క్లీనిక్స్ చేసిన ఒక అధ్యయనంలో వెల్లడించింది.అంతేకాదండోయి రోజులో మూడు సెల్ఫీలు తీసుకుంటున్నారా అయితే ప్రమాదానికి దగ్గరగా ఉన్నట్లేనని అమెరికన్ సైకియాట్రిక్ అసోసియేషన్ (ఏపీఏ) అంటోంది.ఇలా వచ్చే ఆరోగ్య సమస్యన సెల్ఫిటస్ గా పేరు పెట్టేసింది. ఈ సెల్ఫీల వల్ల యాంగ్జైటీ డిజార్డర్లు వచ్చే అవకాశం ఉందంటున్నారు ఈస్థటిక్ క్లీనిక్స్ డైరెక్టర్లలో ఒకరైన డాక్టర్ దేబరాజ్‌షోమే. ఫోటోలు ఎక్కువగా తీసుకోవడం వల్ల మేము ఫోటోలో సరిగ్గా పడలేదు మొహాన్ని మార్చుకోవాలి అనే దృక్పదంతో ఉండిపోవడం వల్ల సర్జరీలు ఎక్కువగా జరుగుతున్నాయని డాక్టర్ దేబరాజ్‌షోమే వెల్లడించారు.ఫ్రంట్ ఫేస్ కెమెరాలను కూడా బ్యాన్ చేసి,ఫ్రంట్ కెమెరా లేని స్మార్ట్ ఫోన్లు సమాజాల్లోకి వస్తే ఇంకా బాగుంటుందేమో అని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఈ ప్రమాదం నుండి బయటపడాలంటే .. పాటించాల్సిన మార్గాలు..1 . ఎక్కువ సమయం దగ్గర వాళ్లతో గడపడం,2 .ఒకరు ఏమనుకున్నారో కాకుండా మీగురించి ,మీరు ఆత్మ విశ్వాసం పెంచుకోవడం,3 . సెల్ఫీ తీసుకొని పోస్ట్ చేసే సమయాన్ని జీవితాన్ని సరిదిద్దుకొనే పనులపై దృష్టి పెట్టడంఇలా చేయడం వల్ల సెల్ఫీ తీసుకోవాలనే ఆలోచన మారుతుందని,వాటివల్ల ఆత్మవిశ్వాసం పెరిగి మనుషుల మధ్య బంధాలు బలపడతాయని,ఇలా చేయడం వల్ల టైంకి తినడం ,పడుకోవడం చేస్తారు కనుక అనేక రోగాల నుండి బయటపడవచ్చునని అంటున్నారు.. సో సెల్ఫీ లవర్స్ బె కేర్ ఫుల్.. అందాన్ని పదిమందికి చూపించడం కన్నా ఆరోగ్యం ఇంపార్టెంట్..

# ఈ టైంలో కాఫీ తాగారంటే

# అది ఒంట్లో విషంగా మారుతుంది!



కాఫీ తాగందే చాలా మందికి రోజు ప్రారంభంకాదు. ఘుమఘుమలాడే కాఫీ నీళు కాసిన్ని గొంతు తడిపితే రోజంతా ఉల్లాసంగా ఉంటుంది. అయితే కొందరు రోజుకు లెక్కకు మించి కాఫీని తాగేస్తుంటారు. ఇలా కాఫీ తాగడం శృతి మించితే ఆరోగ్యానికి అంత మంచిది కాదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా కొన్ని రకాల ఆరోగ్య సమస్యలు ఉన్న వారు కాఫీ తాగారంటే.. చాలా మందికి ఉదయాన్నే తాగే ఒక కప్పు కాఫీతో రోజు ప్రారంభమవుతుంది. ఇలా మొదలైన కాఫీ.. రోజంతా పలు సందర్భాల్లో లాగించేస్తుంటారు. అలా రోజు గడిచే కొద్దీ 10 వరకైనా కాఫీ కప్పులు తాగేస్తారు. అయితే బ్రిటన్‌లో నిర్వహించిన ఓఅధ్యయనం ప్రకారం, మితంగా కాఫీ తాగడం వల్ల మరణ ప్రమాదాన్ని దాదాపు 10 సంవత్సరాల వరకు తగ్గించవచ్చని అంటున్నారు. ఇది మానసిక స్థితిని కూడా రిఫ్రెష్ చేస్తుంది. అయితే కాఫీతో ప్రయోజనాలు మాత్రమే కాదు, ప్రతికూలతలు కూడా ఉన్నాయి. అవేంటంటే.. ఆస్ట్రేలియన్ శాస్త్రవేత్తల ప్రకారం.. రోజుకు 6 కప్పుల కంటే ఎక్కువ కాఫీ తాగితే అది నేరుగా మెదడును ప్రభావితం చేస్తుంది. దీని వల్ల డిమెన్షియా అంటే జ్ఞాపకశక్తి తగ్గిపోయే ప్రమాదం ఎక్కువ. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం కాఫీ అలసట నుంచి ఉపశమనం కలిగిస్తుంది. అయితే ఈ 5 రకాల ఆరోగ్య సమస్యలున్న వారికి మాత్రం కాఫీ ప్రమాదకరం.

కాఫీలో కెఫీన్ ఉంటుంది. ఇది ఒత్తిడి లేదా నిద్ర సమస్యలతో బాధపడుతున్న రోగులకు హానికరం. కెఫిన్ నాడీ వ్యవస్థను సక్రియం చేస్తుంది. హృదయ స్పందన రేటును వేగవంతం చేస్తుంది. ఇది టెన్షన్‌కు కారణం కావచ్చు. పడుకునే ముందు కాఫీ తాగడం వల్ల నిద్రలేమి కలుగుతుంది. శరీరంలో ఐరన్ లోపిస్తే పొరపాటున కూడా కాఫీ తాగకూడదు. నిజానికి, కాఫీ ఐరన్ శోషణకు ఆటంకం కలిగిస్తుంది. ముఖ్యంగా ఆహారంతో తీసుకున్నప్పుడు. కాఫీలో కనిపించే టానిన్ ఐరన్‌తో బంధిస్తుంది. శరీరం దాని శోషణను నిరోధిస్తుంది. ఇది శరీరంలో ఐరన్ లోపానికి కారణమవుతుంది. గర్భధారణ సమయంలో కాఫీకి దూరంగా ఉండటం మంచిది. వాస్తవానికి, ఈ సమయంలో కెఫీన్‌కు దూరంగా ఉండాలి. ఎందుకంటే ఇది శిశువు పెరుగుదల, ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది.

గర్భధారణ సమయంలో కెఫిన్ అధికంగా తీసుకోవడం వల్ల ముందస్తు జననం, తక్కువ బరువుతో బిడ్డ పుట్టడం, గర్భస్రావం జరిగే ప్రమాదం ఉందని పరిశోధనలో తేలింది. గర్భిణీ స్త్రీలు రోజుకు 200mg కంటే ఎక్కువ కెఫిన్ తీసుకోకూడదని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. అంటే ఒక్క కప్పు కాఫీ మాత్రమే తాగాలి. కెఫీన్ రక్తపోటును గణనీయంగా పెంచుతుంది. ఎందుకంటే ఇది గుండె, రక్త నాళాలపై ఒత్తిడిని పెంచుతుంది. ఎవరికైనా B P సమస్యలు ఉంటే, ఎక్కువ కాఫీ తాగడం వలన వారి ప్రమాదాన్ని పెంచుతుంది. ఎవరైనా యాసిడ్ రిఫ్లక్స్ లేదా గ్యాస్ట్రోఎసోఫాగియల్ రిఫ్లక్స్ వ్యాధితో బాధపడుతుంటే, వారు కాఫీ తాగితే, వారి సమస్యలు మరింత పెరుగుతాయి. నిజానికి, కాఫీలోని కెఫిన్ కడుపులో యాసిడ్ ఉత్పత్తిని పెంచడం ద్వారా గుండెల్లో మంట రిఫ్లక్స్‌కు కారణమవుతుంది. ఇది వాపు, ఛాతీ నొప్పి వంటి సమస్యలను కూడా కలిగిస్తుంది.



# చలికాలంలో ఉసిరి తీసుకుంటే

## ఏం జరుగుతుంది?

చలికాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు చాలా మంది ఉసిరి జ్యూస్ తాగుతుంటారు. కానీ ఈ సమస్యలున్నవారు మాత్రం ఉసిరి ఎట్టి పరిస్థితుల్లో తీసుకోకూడదు అంటున్నారు ఆరోగ్య నిపుణులు. పొరబాటున తీసుకున్నారో మీ ఆరోగ్యం ప్రమాదంలో పడిపోతుందని హెచ్చరిస్తున్నారు. కాబట్టి ఈ కింది ఆరోగ్య సమస్యలు ఉన్న వారు. ఉసిరి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ముఖ్యంగా చలికాలంలో శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి చాలా మంది ఉసిరి జ్యూస్ తాగుతుంటారు. ఉసిరితో రకరకాల రోగాలు దూరమవుతాయని సాధారణంగా ఆరోగ్య నిపుణులు చెబుతుంటారు. కానీ మీకు తెలుసా, ఉసిరి తీసుకోవడం వల్ల కొన్ని దుష్ప్రభావాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా కొన్ని రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు ఉసిరి అస్సలు తినకూడదు. ఇలాంటి వారికి ఉసిరి విషంతో సమానం. ఉసిరి అధికంగా తినడం వల్ల రక్తపోటు సాధారణం కంటే భారీగా తగ్గుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు సాధారణం కంటే తక్కువగా ఉన్నవారు కూడా దీనికి దూరంగా ఉండాలి. అలాగే కడుపు సమస్యలు, గుండెల్లో మంట సమస్యలు ఉన్నవారు కూడా ఉసిరి జ్యూస్ తీసుకోకూడదు. ఉసిరికాయను ఎక్కువగా తీసుకోవడం వల్ల మలం గట్టిపడుతుంది. మలబద్ధకం సమస్య ఉన్నవారు ఉసిరికి దూరంగా ఉండాలి. ఉసిరికి మూత్రవిసర్జన లక్షణాలు కలిగి ఉంటుంది. ఇది శరీరంలో ఎక్కువ మూత్రాన్ని విడుదల చేస్తుంది. కాబట్టి ఉసిరికాయను ఎక్కువగా తినడం వల్ల శరీరంలో డీహైడ్రేషన్ సమస్య వస్తుంది. ఈ సమస్యలు లేనివారు చలికాలంలో ఉసిరి పరిమిత మోతాదులో తినవచ్చు. ఇది మన శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడుతుంది.

తెలంగాణ సేన



# క్రీడలు

# ట్రావిస్ హెడ్

## తల పొగరుదించిన ఆకాష్ దీప్

టీమిండియా ఫాస్ట్ బౌలర్ ఆకాశ్‌దీప్ కూడా బ్యాటింగ్‌లో తన ప్రతిభను కనబరిచి భారత్‌కు కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అయితే, అతను బ్యాటింగ్ చేస్తున్నప్పుడు, ఒక ఫన్నీ సంఘటన చోటు చేసుకుంది. ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరలవుతోంది. గబ్బా వేదికగా జరుగుతున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ మూడో టెస్టులో టీమ్ ఇండియా బ్యాటింగ్ చేస్తున్నప్పుడు ఆకాశ్‌దీప్ చేసిన పని వ్యాఖ్యాతలను కూడా నవ్వించేలా చేసింది. బ్యాటింగ్ చేస్తున్న భారత ఫాస్ట్ బౌలర్ ఆకాశ్‌దీప్.. పక్కనే ఉన్న ట్రావిస్ హెడ్‌కి బంతి ఇవ్వకుండా మైదానంలో పడేశాడు. దీనికి ట్రావిస్ హెడ్ కోపంగా చూస్తూ ఉండిపోయాడు. ఆ తర్వాత, ఆకాష్ అలెక్స్ కారీకి సారీ చెప్పడం కనిపించింది. భారత్, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న గబ్బా టెస్టు ఐదో రోజు తొలి సెషన్‌లో ఈ దృశ్యం కనిపించింది. టీమిండియా తొమ్మిది వికెట్లు కోల్పోయింది. జస్ప్రీత్ బుమ్రా, ఆకాష్‌దీప్ చివరి వికెట్‌గా క్రీజులో ఉన్నారు. ఆకాష్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో.. ఓ బంతిని ఆడడం మిస్ అయ్యాడు. ఆ బంతి బ్యాట్‌కు తగిలి ప్యాడ్‌లో ఇరుక్కుపోయింది. సమీపంలో ఫీల్డింగ్ చేస్తున్న హెడ్ ఆకాష్ బంతిని తీసుకోవడానికి వచ్చాడు. ఆకాష్ ప్యాడ్ నుంచి బంతిని తీసివేస్తున్న సమయంలో.. ఆపై హెడ్ బంతిని అడిగాడు. కానీ, బంతిని హెడ్‌కి ఇవ్వకుండా, ఆకాష్ దానిని నేలపై విసిరాడు. ఆ తర్వాత, హెడ్ అతని వైపు చూస్తూ, బంతిని స్వయంగా తీయడం ప్రారంభించాడు. అప్పుడు ఆకాష్ వికెట్ కీపర్ అలెక్స్ కారీకి 'ఐ యామ్ సారీ' అని చెప్పుకొచ్చాడు. ఈ ఫన్నీ సంఘటన చూసి వ్యాఖ్యాతలు కూడా నవ్వడం మొదలుపెట్టారు. ఆ తర్వాత హెడ్ కూడా నవ్వుతూ కనిపించాడు. ఈ ఫన్నీ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా లైక్ అవుతోంది. అనంతరం ఆకాశ్‌దీప్ వికెట్‌ను ట్రావిస్ హెడ్ తీయడం గమనార్హం. 213 పరుగులకే తొమ్మిది వికెట్లు కోల్పోయిన టీమ్ ఇండియా చివరి వికెట్‌కు అవసరమైన పరుగులను జోడిస్తోంది. క్రీజులో బుమ్రా, ఆకాష్ మధ్య మంచి భాగస్వామ్యం నెలకొని ఉంది. వీరిద్దరూ చివరి వికెట్‌కు 47 పరుగులు జోడించారు. కంగారూ జట్టు ప్రధాన బౌలర్లు బుమ్రా, ఆకాష్‌ల వికెట్లను తీయలేకపోయారు. ఆ తర్వాత ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ బంతిని ట్రావిస్ హెడ్‌కి అప్పగించాడు. అతను తన రెండో ఓవర్ ఐదో బంతికి ఆకాష్‌ను అవుట్ చేసి భారత్‌ను 260 పరుగులకు తగ్గించాడు. ఆకాశ్ 44 బంతుల్లో 31 పరుగులతో ఇన్నింగ్స్ ఆడాడు.

# టీమిండియా కొత్త జెర్సీ




ఇండియన్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) కార్యదర్శి జయ్ షా, మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కలిసి, శుక్రవారం, నవంబర్ 29న భారత మహిళల క్రికెట్ జట్టుకు కొత్త వన్డే జెర్సీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో జరిగింది. డిసెంబర్ 5 నుంచి ఆస్ట్రేలియాలో జరగనున్న మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్‌కు ముందు ఈ జెర్సీని ఆవిష్కరించారు. భారత మహిళా క్రికెట్ జట్టుకు కొత్త జెర్సీ, కొత్త లుక్ తెచ్చిపెట్టిందని ఫ్యాన్స్ కామెంట్లు చేస్తున్నారు. అదిరిపోయిందని అంటున్నారు. ఈ కొత్త జెర్సీలో భుజాలపై మూడు రంగుల తివర్ణ పతాకం ఉండటం ప్రత్యేకత. ముందు జెర్సీలో మూడు తెల్లటి చారలు మాత్రమే ఉండేవి. డిసెంబర్ 22 నుంచి 27 వరకు వడోదరలో జరగనున్న వెస్టిండీస్‌తో జరిగే మూడు వన్డే మ్యాచ్‌లలో భారత మహిళా జట్టు తొలిసారిగా ఈ కొత్త జెర్సీని ధరించనుంది. జెర్సీ ఆవిష్కరణ సందర్భంగా మాట్లాడిన జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, "ఈ జెర్సీని ఆవిష్కరించడం చాలా గర్వంగా ఉంది. వెస్టిండీస్‌తో జరిగే మ్యాచ్‌లో మేమే తొలిసారిగా దీన్ని ధరించడం చాలా ఆనందంగా ఉంది. ఈ జెర్సీ డిజైన్ నాకు చాలా నచ్చింది. ముఖ్యంగా భుజాలపై ఉన్న త్రివర్ణ పతాక రంగులు చాలా అందంగా ఉన్నాయి. ఇది చాలా ప్రత్యేకమైన వన్డే జెర్సీ" అని అన్నారు. మహిళా క్రికెట్ జట్టు వెస్టిండీస్‌తో ఆడే మ్యాచ్‌లకు ముందు ఆస్ట్రేలియాలో మూడు వన్డే మ్యాచ్‌లు ఆడనుంది. ఆ తర్వాత భారతదేశానికి తిరిగి వచ్చి వెస్టిండీస్‌తో మూడు టీ20లు, మూడు వన్డే మ్యాచ్‌లు ఆడనుంది. 2023 నుంచి అడిడాస్ భారత క్రికెట్ జట్టుకు కిట్ స్పాన్సర్‌గా ఉంది.

అప్పటి నుంచి జట్టు తరచూ తమ జెర్సీలను మార్చుకుంటూ వస్తోంది. గత ఏడాది పురుషుల వన్డే ప్రపంచ కప్‌కు, ఈ ఏడాది టీ20 ప్రపంచ కప్‌కు ప్రత్యేక జెర్సీలను తీసుకొచ్చారు. అంతేకాకుండా, బ్లూ కలర్ కాలర్‌తో కూడిన తెల్లటి పోలో షర్టు వంటి భారత జట్టు ప్రాక్టీస్ కిట్‌లు కూడా చాలా ప్రాచుర్యం పొందాయి. నవంబర్ 28న, పురుషుల జట్టు ఆస్ట్రేలియా పార్లమెంట్ హౌస్‌కు వెళ్లినప్పుడు ఈ తెల్లటి పోలో షర్టు ధరించారు. అక్కడ వారిని ప్రధానమంత్రి ఆంథోని ఆల్బనీస్ ఆహ్వానించారు.

# డ్రాగా ముగిసిన గబ్బా టెస్ట్




భారత్–ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న గబ్బా టెస్టు డ్రా అయింది. ఐదో రోజు వర్షం కారణంగా పెద్దగా ఆట జరగకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. సిరీస్ 1–1తో సమంగా మారింది. ఇక నాలుగో టెస్ట్ మ్యాచ్ డిసెంబర్ 26 నుంచి మెల్‌బోర్న్‌లో జరుగుతుంది. భారత్–ఆస్ట్రేలియా మధ్య జరిగిన గబ్బా టెస్టు డ్రా అయింది. ఐదో రోజు వర్షం కారణంగా పెద్దగా ఆట జరగకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆస్ట్రేలియా భారత్‌కు 275 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ప్రతిస్పందనగా టీమ్ ఇండియా వికెట్ నష్టపోకుండా 8 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్రిస్బేన్‌లో భారీ వర్షం కురవగా, ప్రతికూల వాతావరణం కారణంగా మ్యాచ్ డ్రా అయింది. ప్రస్తుతం టెస్టు సిరీస్ 1–1తో సమంగా ఇరుజట్లు నిలిచాయి. తదుపరి మ్యాచ్ డిసెంబర్ 26 నుంచి మెల్‌బోర్న్‌లో జరగనుంది. మొత్తం మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు ఆధిపత్యం ప్రదర్శించినా నాలుగో, చివరి రోజు మాత్రం టీమిండియా అద్భుత ఆటతీరును ప్రదర్శించిందనడంలో సందేహం లేదు. ఆస్ట్రేలియా టీమిండియాకు కేవలం 275 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. గత పర్యటనలో ఆస్ట్రేలియాపై ఇదే మైదానంలో 328 పరుగుల స్కోరును ఛేదించిన టీమిండియా రికార్డు సృష్టించింది. ఇలాంటి పరిస్థితుల్లో ఈసారి కూడా ఈ స్కోరును ఛేదించడం సాధ్యమనిపించింది. అయితే, వర్షం ఆస్ట్రేలియాను కాపాడినట్లు అంతా భావిస్తున్నారు. ఎందుకంటే గబ్బా మైదానంలో టీమిండియాకు అనుకూలమైన చరిత్ర ఉంది. గబ్బా టెస్టులో భారత జట్టు తరపున జస్ప్రీత్ బుమ్రా అద్భుత ప్రదర్శన చేశాడు. అతను మొదటి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు, రెండవ ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు తీసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అతని పేరిట 9 వికెట్లు ఉన్నాయి. ఆస్ట్రేలియా తరపున, ట్రావిస్ హెడ్ మొదటి ఇన్నింగ్స్‌లో 152 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. హెడ్ ?తర్వాత స్టీవ్ స్మిత్ తొలి ఇన్నింగ్స్‌లో 101 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు.

## రిటైర్మెంట్ ప్రకటించిన టీమిండియా స్టార్ స్పిన్నర్..



ఆఫ్ స్పిన్నర్ ఆర్ అశ్విన్ గబ్బా టెస్టు ముగిసిన వెంటనే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. 38 ఏళ్ల అశ్విన్ తన అంతర్జాతీయ కెరీర్‌లో 765 వికెట్లు పడగొట్టాడు. అలాగే, టెస్టు క్రికెట్‌లో 6 సెంచరీల సాయంతో 3503 పరుగులు చేశాడు. భారత ఆఫ్ స్పిన్నర్ ఆర్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. గబ్బా టెస్టు ముగిసిన వెంటనే అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇప్పటి వరకు భారత టెస్టు చరిత్రలో అత్యంత విజయవంతమైన బౌలర్లలో రవిచంద్రన్ అశ్విన్ ఒకడిగా పేరుగాంచాడు. ఈ టూర్‌లో అతనికి ఇప్పటి వరకు ఒకే ఒక్క మ్యాచ్ ఆడే అవకాశం లభించింది. అడిలైడ్ తర్వాత, అతను గబ్బా టెస్టుకు దూరమయ్యాడు. గబ్బా టెస్టు సందర్భంగా అశ్విన్ టీమిండియా ఆటగాళ్లను కౌగిలించుకుంటూ కనిపించాడు. కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీని కౌగిలించుకున్నాడు. అశ్విన్ కూడా హెడ్ కోచ్ గంభీర్‌తో చాలాసేపు మాట్లాడి, ఆపై విలేకరుల సమావేశానికి వచ్చి రిటైర్మెంట్ ప్రకటించి షాక్ ఇచ్చాడు. అశ్విన్ టెస్టు క్రికెట్‌లో 106 మ్యాచ్‌లు ఆడి 537 వికెట్లు తీశాడు. అతను తన పేరిట 37 ఐదు వికెట్లు సాధించాడు. మ్యాచ్‌లో 8 సార్లు 10 వికెట్లు తీసుకున్నాడు. అశ్విన్ వన్డేల్లో 156 వికెట్లు కూడా తీశాడు. టీ20లో అశ్విన్ 72 వికెట్లు తీశాడు. అతను తన అంతర్జాతీయ కెరీర్‌లో 765 వికెట్లు సాధించాడు. బ్యాట్స్‌మెన్‌గానూ అశ్విన్ తనదైన ముద్ర వేశాడు. టెస్ట్ క్రికెట్‌లో 3503 పరుగులు చేశాడు. అతను మొత్తం 6 టెస్ట్ సెంచరీలు చేశాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మొత్తం 8 సెంచరీలు చేశాడు. ఆర్ అశ్విన్ తన కెరీర్‌లో ఎన్నో పెద్ద మైలురాళ్లను సాధించాడు. రికార్డులతో పాటు 2011లో వన్డే ప్రపంచకప్ గెలిచిన జట్టులో భాగస్వామ్యం అయ్యాడు. అలాగే, 2013లో ఛాంపియన్స్ ట్రోఫీతోపాటు ఆసియా కప్‌ను కూడా అశ్విన్ గెలుచుకున్నాడు. టెస్టుల్లో అత్యధిక ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డులను కూడా అశ్విన్ గెలుచుకున్నాడు. భారత్–ఆస్ట్రేలియా మధ్య జరిగిన బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ మూడో టెస్టు డ్రాగా ముగిసింది. బ్రిస్బేన్‌లోని గబ్బా మైదానంలో జరిగిన మ్యాచ్‌లో చివరి రోజైన బుధవారం కేవలం 25 ఓవర్లు మాత్రమే వేయగలిగారు. ఆస్ట్రేలియా భారత్‌కు 275 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అయితే వర్షం కారణంగా ఒక రోజు ఆట రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో టీమిండియా స్పిన్నర్ అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించాడు.



# నితిన్ సినిమా వెనక్కి వెళ్లింది

నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాబిన్ హుడ్' మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ చిత్రం డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. అయితే ఈ చిత్రాన్ని వాయిదా వేస్తున్నట్లు నిర్మాణసంస్థ ప్రకటించింది. అనుకోని పరిస్థితుల వల్ల సినిమాను వాయిదా వేయాల్సి వచ్చిందంటూ మైత్రీ మూవీస్ పోస్ట్ పెట్టింది. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపింది. నితిన్– వెంకీ కుడుముల కలయికలో రానున్న రెండో చిత్రమిది. శ్రీలీల కథానాయిక. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇటీవల చిత్రబృందం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లోనూ షూటింగ్ అప్‌డేట్ పంచుకుంది. షూటింగ్ దాదాపు పూర్తయిందని ఒక్క పాట మాత్రమే మిగిలి ఉందని చెప్పారు. అయితే పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కారణంగా సినిమా విడుదల ఆలస్యమైనట్లు సమాచారం. నితిన్ కెరీర్‌లో అత్యంత భారీ బడ్జెట్ మూవీగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇటీవల విడుదలైన టీజర్, పాటలు మంచి ఆదరణను సొంతం చేసుకున్నాయి.



# విడుదల పార్ట్ 2 లెంగ్తీ రన్ టైంతో వెట్రిమారన్ టీంకు మరో ఛాలెంజ్?

కోలీవుడ్ దర్శకుడు వెట్రిమారన్ డైరెక్షన్‌లో విజయ్ సేతుపతి లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం విడుదల పార్ట్ 2 ఈ మూవీ డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది టీం. కాగా తాజాగా ఆసక్తికర చర్చ ఒకటి నెట్టింట జరుగుతోంది. సీక్వెల్ రన్ టైం 2 గంటల 52 నిమిషాలు (172 నిమిషాలు). అయితే ఫస్ట్ పార్ట్‌తో పోలిస్తే కేవలం ఈ రన్ టైం 2 నిమిషాలే ఎక్కువ. పార్ట్ 1 లో తెలుగు వెర్షన్ విషయానికొస్తే రిలీజ్ సమయంలో రన్ టైం టాక్ ఆఫ్ ది పాయింట్‌గా నిలిచింది. పార్ట్ 1 లో స్లో నరేషన్ ప్రేక్షకులను రెండు పార్టులుగా డివైడ్ చేసింది. బలమైన కథాంశం ఉన్నప్పటికీ తెలుగు ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన రాబట్టుకుంది. ఇప్పుడిక ఇదే లైన్‌లో సీక్వెల్ కూడా వస్తుండటంతో మరి తెలుగు ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. స్టోరీ టెల్లింగ్‌తో ఇంప్రెస్ చేసే వెట్రిమారన్ టీంకు రన్ టైం మాత్రం మరోసారి ఛాలెంజ్ కానుందంటూ ట్రేడ్ పండితులు అభిప్రాయపడుతున్నారు. మరి కంటెంట్ బాగుంటే చాలు ప్రేక్షకులు వాటన్నింటిని వెనక్కినెట్టేస్తారని సీక్వెల్ నిరూపిస్తుందా..? లేదా అనేది సర్వత్రాఉత్కంఠ నెలకొంది.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad "office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332